# నవతెలంగాణ

# మెదక్

1

బుధవారం | 20 నవంబర్ 2024 | www.navatelangana.com


## కలెక్టర్‌ను కలిసిన భేల్ ఎస్సీ అసోసియేషన్ నాయకులు



**నవతెలంగాణ-రామచంద్రాపురం**

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని మంగళవారం భేల్ నూతన ఎస్సీ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు కలిసారు.ఈ సందర్భంగా అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను సభ్యులు కలెక్టర్ కు వివరించారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా కలెక్టర్ ను కలిసినట్లు అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కొడాలి సూరేష్, సభ్యులు శ్రీను, కోటేశ్వర్ రావు, యెలేందర్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి



**నవతెలంగాణ-మనూర్**

ఆశా వ్కర్లకు కనీస వేతనాలు వెంటనే అమలు చేయాలని ఏఐటీ యూసీ జిల్లా నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. మండల పీహెచ్సీ పరిధిలో ఆశ వర్కర్ల సమావేశం మంగళ వారం జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశాలకు ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. కనీస వేతనాలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో పెట్టారని.. వెంటనే అమలు చేయాలన్నారు. సర్వేల పేరుతో అధికారుల వేధింపులు ఆపాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఎలీషా, లక్ష్మి, సాయమ్మ, మంజుల, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి మహిళ ఆర్థికంగా లబ్ధి పొందాలి

- త్వరలో విదేశాల కోసం ప్రత్యేక క్యాంప్
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్**

మహిళలు, యువత సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని, ప్రతి మహిళ ప్రస్తుతం ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి పొందాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి తో కలిసి సెట్విన్ సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. సెట్విన్ శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్ సెంటర్, బ్యూటిషన్ సెంటర్, కంప్యూటర్ ల్యాబ్, ఐటిఐ మెకానిక్స్ సంబంధిత సెంటర్‌ను ప్రారంభించారు. బ్యూటిషన్ శిక్షణపై మహిళలకు అవగాహన కల్పించారు. స్వయంగా కుట్టు మిషన్‌పై కూర్చొని శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మహిళల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉత్సాహాన్ని నింపారు. గిరిధర్ రెడ్డి సెట్విన్ చైర్మన్‌గా నియామకం అయినా తరువాత కార్యకలాపాలు విస్తృత పరిచారని పేర్కొన్నారు. సెట్విన్ శిక్షణ కేంద్రాలు హైదరాబాద్ లో 19 ,జిల్లాలో నాలుగు సెట్విన్ శిక్షణ కేంద్రాలు ఉన్నాయనీ తెలిపారు. కొత్తగా ఐదు శిక్షణ కేంద్రాలు రానున్నాయి ఈరోజు హుస్నాబాద్ కేంద్రంలో సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించుకున్నమని తెలిపారు. జహీరాబాద్ , మహబూబ్ నగర్ , జడ్చర్ల , నల్గొండలో కూడా కొత్తగా సెట్విన్ శిక్షణ కేంద్రాలు రానున్నాయన్నారు. మహిళలు ఇంట్లోనే కూర్చొని ఆదాయం పెంచుకోవడానికి సెట్విన్ వివిధ రకాల శిక్షణ అందిస్తుందన్నారు. త్వరలో విదేశాలకు వెళ్ళే వారి కోసం టాంకాం ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తామన్నారు. హుస్నాబాద్ ప్రాంత మహిళలు ఎవరి కాళ్ళ మీద వారు నిలబడేలా తయారు కావాలనీ, కుట్టు మిషన్ , బ్యూటీషన్ , కంప్యూటర్ ల్యాబ్ ఎంఎస్ ఆఫీస్ , అకౌంటెంట్ ఉన్నాయనీ అందులో నైపుణ్యం సాధించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యూటీషన్ కోర్స్ వస్తుందని మహిళలకు ఆదాయ మార్గంగా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ మానాల మోహన్,సెట్విన్ ఎండీ వేణుగోపాల్ ,అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న ,వైస్ చైర్మన్ అనిత , సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి ,డీపీఓ ,ఆర్డీవో రామ్మూర్తి , ఎమ్మార్వో రవీందర్ రెడ్డి, అధికారులు , హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

### సహకార సంఘాన్ని అభివృద్ధి చేస్తాం

**నూతన సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి**

హుస్నాబాద్‌లోని సహకార సంఘాన్ని అనేక రకాలుగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ విశాల సహకార పరపతి సంఘం లి. హుస్నాబాద్ లో1200 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల నూతన సంఘ కార్యాలయం, నూతనంగా నిర్మించిన గోదాంలను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1959 లో ఈ సంస్థ ఏర్పడిందని, భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా వారం రోజుల పాటు ఈ సహకార వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ సహకార వ్యవస్థాపకులు మాజీ శాసన సభ్యులు మాజీ సర్పంచ్ బొప్పరాజు లక్ష్మీకాంతరావు మనందరికీ ఆదర్శ మూర్తి అని, ఏ కార్యక్రమం జరిగినా బొప్పరాజు పేరును స్మరించుకోకుండా ఉండలేమన్నారు. చౌటపల్లిలో పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామని రైతులకు సంబంధించిన వాటినే అక్కడ పెడతామన్నారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, రైస్ మిల్స్ అగ్రికల్చరల్ కి సంబంధించివి పెడతామని తెలిపారు. సహకార రంగాల్లో అందరినీ కలుపుకొని పోవాలని అన్నారు. సభ్యులు ఎక్కువ ఉండి లోన్ తీసుకొని వారు తక్కువ ఉంటే లాభం ఉండదన్నారు. ఈ సొసైటీ ద్వారా రూ రూ.504 కోట్ల రుణమాఫీ జరిగిందని, 204 మందికి రుణమాఫీ జరగల్సి ఉందన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న వారికి కుటుంబాల నిర్ధారణ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘాల అభివృద్ధి చైర్మన్ మానాల మోహన్, ములకనూరు సహకార బ్యాంక్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, జిల్లా సహకార సంఘ అధ్యక్షులు కొండూరి రవీందర్ , తెలంగాణ కోపరేటీవ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ , సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ , సిద్దిపేట గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న ,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాలలో దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-రాయికోడ్**

తెలంగాణ ఆదర్శ కళాశాలలో బోధించుటకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పాపారావు తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను భౌతిక శాస్త్రం, వృక్ష శాస్త్రం ,గణితం బోధించుటకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఒక పిరియడ్‌కు రూ.182, నెలకు 100 పీరియడ్ల రూ.18,000 ఇస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులను కళాశాల సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డెమో ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

## జాతీయ వాలిబాల్ పోటీలకు రాయికోడ్ విద్యార్థి ఎంపిక



**నవతెలంగాణ-రాయికోడ్**

అండర్-14 జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు రాయికోడ్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి హనుమంతు ఎంపికైనట్టు ఎంఈఓ అంజయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. ఇటీవల చేగుంటలో నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేసినట్టు చెప్పారు. విద్యార్థులు ఆటాపాటలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు.

## భద్రకాళీ ఆలయాన్ని సందర్శించిన పులిమామిడి రాజు



**నవతెలంగాణ-సదాశివపేట**

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వరంగల్ భద్రకాళీ మాత ఆలయాన్ని మిత్ర బృందంతో కలిసి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు మంగళవారం సందర్శించారు. కార్తీక మాసం అనేది అత్యంత పవిత్ర మాసమన్నారు. భద్రకాళీ అమ్మవారు రాష్ట్ర ప్రజలందరిని చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, మిత్రులు మహేష్ కుమార్‌గౌడ్, సతీష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధి విలేకర్లు



**నవతెలంగాణ-రాయికోడ్**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధి విలేకరులని స్థానిక ఎంఈఓ అంజయ్య అన్నారు. మండల కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విలేకరుల దినోత్సవం సందర్భంగా.. విలేకరులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను వెలికి తీయడంలో గ్రామీణ ప్రాంత విలేకరులు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు రాములు, విఠల్‌రావు కులకర్ణి, శంకర్, పండరి, గోపాల్, సాయిబాబా,హనుమంతు,రమేష్, సదం, బాబూరావు, ఉపాధ్యాయులు ఖైరతాలి, సునంద,శివలక్ష్మి, శోభారాణి, అనంతరావు,సంగీత,వినోద పాల్గొన్నారు.

## ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ ఎందుకు అమలు చేయడం లేదు



**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

అందరి ఉద్యోగులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసినా.. ఎందుకు అమలు చేయడం లేదని రెండో వార్డు కౌన్సిలర్ వారాల గోపాలమ్మ వెంకటయ్య అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. బయోమెట్రిక్ విధానం కేవలం కింది స్థాయి కార్మికులకు మాత్రమే అమలు చేస్తున్నారని మున్సిపల్ ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించడం లేదని, ఎప్పుడు ఎవరు ఏ సమయానికి వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అందరి ఉద్యోగులు, అధికారులకు కౌన్సిల్‌లో తీర్మానం ప్రకారం వెంటనే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని కమిషనర్‌ను కోరారు. లేని యెడల కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

## బైకు అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి



**నవతెలంగాణ-హవేలీ ఘనపూర్**

ప్రమాదవశత్తు బైక్ అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.హవేలీ ఘనాపూర్ ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం మండల పరిధిలోని ఫరీద్ పూర్ శివారులో చోటు చేసుకుంది. మృతులు జక్కన్నపేట గ్రామానికి చెందిన మామిళ్ళ మహేష్ (23) శీల ప్రభాకర్(22) మంగళవారం మెదక్ -సర్ధన ప్రధాన రహదారి గుండా జక్కన్నపేట వెళ్లే క్రమంలో ఫరీద్ పూర్ వద్ద బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మహేశ్‌ను మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం పోలీసులు జిల్లా ఆసుపత్రిలో ఉన్న మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ఘోర రోడ్డు ప్రమాదం అక్కడికక్కడే ఇద్దరు మృతి





**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల గ్రామ శివారులో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.జనగామ జిల్లా, బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఏనుగుల కర్ణాకర్ (37)దూసరి సాయిలు(39) లు చేర్యాల నుండి తమ గ్రామానికి వెళ్తుండగా మార్గ మధ్యంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ శివారు ప్రగతి స్కూల్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.సంఘటన స్థలానికి చేరుకున్న చేర్యాల పోలీసులు మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## రైస్ మిల్లు, కొనుగోలు కేంద్రాలను సందర్శించిన తహశీల్దార్ విజయలక్ష్మి



**నవతెలంగాణ-తూప్రాన్** : తూప్రాన్ మండలంలోని నాగులపల్లిలో ఉన్న ధనలక్ష్మీ రైస్ మిల్లు ను, గుండ్రెడ్డిపల్లి ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దారు విజయలక్ష్మి మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా ధనలక్ష్మి రైస్ మిల్లులో ఐకెపి సొసైటీ కొనుగోలు కేంద్రాల ద్వారా రైస్ మిల్ కు పంపించిన దిగుమతి చేసుకున్న ధాన్యాన్ని తహశీల్దార్ పరిశీలించారు.రైస్ మిల్‌లో ఇప్పటివరకు 24 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసినట్లుగా తెలిపారు. మంగళవారం 2 లారీలు దిగుమతి చేసినట్లుగా తెలిపారు. ఇంకా 3 లారీలను దిగుమతి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అక్నాలెడ్జ్మెంట్ స్ 4 లారీలకి ఇచ్చినట్టుగా తెలిపారు.మరికొన్ని వరి కొనుగోలు కేంద్రాల నుంచి సమస్యలు ఉన్నట్లుగా తెలిపారు. సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని,కొనుగోలు వేగవంతం చేయాలని ఏపీఎం రుక్మిణికి తహశీల్దార్ విజయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. గుండ్రెడ్డిపల్లి ఐకేపీ కేంద్రంలో 8 లారీలు,5 డీసీఎంలలో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి,లోడ్ చేసి, మొత్తం 6170 బస్తాలను రవాణా చేసినట్లుగా తహశీల్దార్ తెలిపారు. ఒక లారీలో 650 బ్యాగులు లోడ్ చేస్తున్నట్లుగా తెలిపారు.5 ట్రక్ శీట్ రసీదులతో పాటు రైస్ మిల్లరు అక్నాలెడ్జ్మెంట్ ఇచ్చినట్లుగా తెలిపారు.ఇందులో ఈరోజు 23 మంది రైతుల నుండి ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది కలగకుండా,ఎలాంటి అవకతవకలు జరగకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## పత్తికి క్వింటాలుకు రూ.7521 మద్దతు ధర చెల్లించాలి

**దళారులను అరికట్టాలి**

**సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు**

**వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో వినతి**



**నవతెలంగాణ-సంగారెడ్డి**

పత్తికి క్వింటాలుకు ప్రభుత్వ నిర్ణయించిన మద్దతు ధర రూ.7521 రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో రాహుల్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా 3,70,000 ఎకరాల్లో పత్తి సాగు అవుతున్నదన్నారు. అత్యధిక మంది రైతులు పత్తిలో అధిక పెట్టుబడులు పెట్టి, ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున నష్టపోయారన్నారు. దిగుబడి పోయిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వకుండా మధ్యధలారులు చేతికి అందిన కాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. క్వింటాల్‌కు రూ.6500 నుండి 6800 చెల్లిస్తూ దళారులు బాగుపడుతున్నారన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కూడా 7,521 పూర్తిగా రావటం లేదన్నారు. రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో రైతులను దోచుకుంటున్న మధ్యదళారులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే.రాజయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## డీడీఎస్‌కు మరోఅరుదైన గౌరవం

**ఇందిరా గాంధీ వ్యవసాయ ప్రతిభ అవార్డుకు డీడీఎస్ ఎంపిక**



**నవతెలంగాణ-ఝరాసంగం, జహీరాబాద్**

నిరంతరం చిరుధాన్యాల సాగు కోసం కృషి చేస్తున్న డీడీఎస్ సంస్థకు మరోసారి అరుదైన గౌరవం లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజయోత్సవాల సందర్భంగా.. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ వ్యవసాయ ప్రతిభ పురస్కారాలను రాష్ట్రవ్యాప్తంగా నలుగురికి అందించారు. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) మహిళా సంఘానికి చెందిన మహిళా రైతు చిరుధాన్య పంటలైన కొర్ర, సజ్జ, సామ, జొన్న మొదల్కైన పంటలను పండించినం దుకు ఈ అవార్డును అందజేశారు. ఝరాసంగం మండలంలోని బిడకన్నె గ్రామానికి చెందిన సదరు డీడీఎస్ మహిళా రైతు చంద్రమ్మను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మెన్ యం.కొండండరెడ్డి ప్రజా ప్రతినిదులందరు కలిసి సత్కరించారు. ఈ అవార్డు ప్రధానోత్సవం కార్యక్రమంలో మెట్లకుంట గ్రామానికి చెందిన సూర్యకళ, అర్జున్ నాయక తాండకు చెందిన చాందిబాయి, డిడియస్ సిబ్బంది జనరల్ నర్సమ్మ మరియు టి.మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలి

**కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి**

**గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి**

**సీఐటీయూ ఆధ్వర్యంలో డిపో ఎదుట ధర్నా**





**నవతెలంగాణ-సంగారెడ్డి**

ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపాలని..కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేసి, గుర్తుంపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. అనంతరం డీఎం ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు మాట్లాడుతూ.. 2019 డిసెంబర్ నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. సామాజిక భద్రత పథకాలైన పిఎఫ్, ఎస్ఆం"బిఎస్బిటి ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగసా వ్యామ్యంతో బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల ఉద్యమంపై ఆంక్షలు విధించిందన్నారు. కార్మికుల నుంచి ప్రశ్నలు రాకుండా చేస్తూ నిర్బంధాన్ని పెట్టిందన్నారు. వెంటనే కార్మిక సంఘాల పెట్టిన ఆంక్షలను ఎత్తివేయాలన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. కేఎంపిఎల్ తేవాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని డ్రైవర్లకు అదనపు టైం పెడుతూ ఇబ్బందులు గురిచేస్తున్న పరిస్థితి ఉందన్నారు డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని పనిభారం తగ్గించాలని, కొత్త టీం లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పని గంటల పెరుగుదల విపరీతమైన పని భారంతో ఉద్యోగులు కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒత్తిడితో అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పని భారం మూలంగా మహిళలు కూడా అర్ధరాత్రి వరకు డ్యూటీ చేస్తున్నారని ఈ సరైనది కాదని వెంటనే పని భారం తగ్గించాలన్నారు. లేనియెడల పోరాటం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం. యాదగిరి, బాబురావు, అశోక్, శివ, మహేష్, వెంకటేష్, రాజు, రాజేష్, నర్సింలు, లక్ష్మయ్య, నరేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను వదిలిపెట్టబోం



**నవతెలంగాణ-అమీన్‌పూర్**

అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని అమీన్‌పూర్ టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని పెద్దచెరువులో చేపట్టిన అక్రమ నిర్మాణాలను సోమవారం సాయంత్రం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. అక్రమ నిర్మాణాలను చేపట్టి అనవసరంగా నష్టపోవ ద్దన్నారు. ఒకట్రెండు ఆలస్యమైనా తమ దృష్టికి వస్తే.. అనుమతి లేకుండా చేపట్టిన నిర్మాణాలను నేలమట్టం చేసి తీరుతామని స్పష్టం చేశారు. పైగా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై కేసులు సైతం నమోదు చేస్తామన్నారు. అనధికారిక వ్యక్తుల మాటలు నమ్మి ఎవ్వరూ మోసపోవద్దని, పక్కాగా అనుమతులు తీసుకుని బిల్డింగ్ నిర్మాణం చేస్తే.. ఎలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం ఉండదని సూచించారు. శిఖం భూములు, చెరువుల, ఇరిగేషన్, ప్రభుత్వ స్థలాల్లో భవనాలు నిర్మించి నష్టపోవద్దని హెచ్చరించారు. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినా మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజాపయోగ స్థలాలు, పార్కులు, కాలనీల రోడ్లు ఆక్రమించినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

## నామమాత్రంగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ





**నవతెలంగాణ-న్యాల్‌కల్**

15వ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 20023/24 సంవత్సరం గాను పనులు సామాజిక తనిఖీ ప్రజా వేదిక న్యాల్‌కల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నామమాత్రంగా కొనసాగింది. ఉపాధి కూలీలు లేక ప్రజా వేదిక తనిఖీ వెలవెలబోయింది. ఆరో తేదీ నుంచి గ్రామాల్లో తనిఖీ చేపట్టగా.. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా వేదిక జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బాలరాజ్, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజర్ మణికుమార్ హాజరై ప్రజావేదిక నిర్వహించారు. ఉపాధి పనులపై గ్రామాల్లో ప్రజలు లేకుండా గ్రామ సభలు జరిగాయని.. నోటీస్ బోర్డ్, నర్సరీ ఉపయోగం లేదని.. మాస్టర్లపై సంతకాలు లేవని ఏపీఓ ఎంపీడీవో రికార్డులు సంతకాలు చేయలేదని, ఉపాధి కూలీలకు పని జరగకుండానే డబ్బులు చెల్లించడం జరిగిందని తనిఖీ బృందం వెల్లడించింది. జరిగిన ఉపాధి పనుల పలు అవకత వకలు వెలుగులో వచ్చాయి. మండలంలో రూ.1,55 వేలు ప్రజా వేదికలో అవకతవకలు జరిగినట్లు ఏపిడి తెలిపారు. రికవరీ చేస్తూ 30 గ్రామాల్లో తనిఖీ చేపట్టినట్టు ఏపీడి బాల్‌రాజ్ అన్నారు. వంద రోజుల కన్నా కూలీలకు అదనపు పని కల్పించినట్టు తనిఖీ బృందం వెల్లడించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న రాజోల, టేకురు, గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పై చర్యలు తీసుకుంటున్నట్టు ఏపిడీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ సుభాష్, ఎంపీడీవో , ఏపీఓ, టీఏలు, ఎస్ఆర్పిలు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ సెక్రెటరీలు సంతోష్ కుమార్ ఉన్నారు.

## కస్టోడియన్ భూముల్లో అర్హులైన రైతులకు పట్టాలివ్వాలి



**నవతెలంగాణ-గుమ్మడిదల**

మండల పరిధిలోని లక్ష్మాపూర్ కస్టోడియన్ భూములను అర్హులైన రైతులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 01 నుంచి 59 నంబర్లలో సుమారు 1000 ఎకరాల కస్టోడియన్ భూములు ఉన్నాయని.. వాటిని జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, మెదక్ జిల్లా కార్యదర్శి పీఎం ఖలీల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. గత 50ఏండ్లుగా ప్రభుత్వ కస్టోడియన్‌గా ఉన్న భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. తమకు భూమి పైన హక్కులు కావాలని పట్టా పాస్‌పుస్తకాలు ఇవ్వాలని అనేకమార్లు రైతులు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా.. ఇప్పటివరకు వారికి పాసుపుస్తకాలు ఇవ్వలేదన్నారు. ఈ కస్టోడియన్ భూములలో ఎనిమిది వందల ఎకరాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నదని.. ఖాళీగా ఉన్న భూములను ఆ గ్రామాల్లో ఉన్న పేద ప్రజలకు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. తక్షణమే అధికారులు స్పందించి గ్రామాన్ని సందర్శించి సాగులో ఉన్న రైతులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వడంతో పాటు మిగిలి ఉన్న భూములను పేద ప్రజలకు చెందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక గ్రామాల్లో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను, భూస్వాముల భూములను పేద ప్రజలు స్వాధీనం చేసుకున్నారన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములను కలెక్టర్ స్థాయి అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై బినామీలను సృష్టించుకుని అక్రమంగా వారికి పట్టాలిచ్చారని ఆరోపించారు. ఈ భూ కుంభకోణంపై ఈడి.. జిల్లా స్థాయి కలెక్టర్‌గా పనిచేసిన అధికారులను పిలిపించి విచారించి వారి పైన చర్యలకు సిద్ధవవుతున్నదన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ జరపడం కోసం రిటైర్డ్ జడ్జితో కమిటీ వేసి భూకబ్జాదారులు చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకొని పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధరణి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములను దొంగ చాటుగా అక్రమంగా అధికార పార్టీ నాయకుల అనుచరుల పేర్ల మీద పట్టాలు చేయించుకోవడం జరిగింద న్నారు. ఇటువంటి భూకబ్జాదారుల పైన క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయ కులు మహబూబ్‌ఖాన్, మోహన్‌రెడ్డి,దేవేందర్ తదితరులున్నారు.

## 'నాందేడ్' ఎన్నికల్లో సురేష్ శెట్కార్ కీ రోల్..



**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికల సందర్భంగా నాందేడ్ పార్లమెంట్‌కు ఉప ఎన్నిక జరుగుతున్నది. నాందేడ్ పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కీ రోల్ పోషిస్తున్నారు. ఈ స్థానానికి సంబంధించి 9 నియోజకవర్గాలు ఉండగా.. అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తలతో ఇప్పటికే అనేక సమావేశాలు ఏర్పాటు చేశారు. నాందేడ్‌లో స్టార్ క్యాంపెనియర్‌గా ఆయా నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహించారు. ఈ నియోజకవర్గం పరిధిలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన చేయనున్నట్లు భారీ బహిరంగ సభలు ప్రచారం చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి పర్యటనకు విజయవంతం చేయాలని ఆయా నియోజకవర్గాల్లో ఎంపీ సురేష్ షెట్కార్ అంతర్గత సమావేశాలు, ముఖ్య కార్యకర్తల సమావేశాలు విడతల వారీగా నిర్వహిస్తున్నారు. రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని అక్కడి ప్రజలకు ఎంపీ పిలుపునిచ్చారు.

## ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేయాలి



**నవతెలంగాణ-జహీరాబాద్**

సంఘాలకు అతీతంగా ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బ్రాహ్మణులందరూ కృషి చేయాలని మధవానంద సరస్వతి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి సూచించారు. జహీరాబాద్ పట్టణంలోని నూతనంగా నిర్మించే రాఘవేంద్ర స్వామి మఠం ఆవరణలో మంగళవారం జరిగిన వైదిక, వైదికతర బ్రాహ్మణులకు అనుగ్రహ భాషణం అందించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిదిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 19వ తేది నుండి నాలుగు రోజుల పాటు న్యాల్కల్ మండలం రేజింతల్ లోని శ్రీ సిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో తన ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగే కోటి రుద్ర పారాయణం, లక్ష మోదక హవనం కార్యక్రమానికిచిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలన్నారు. అదే విధంగా ఈనెల 24న సంగారెడ్డి జిల్లా కేంద్రం బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగే అష్టోత్తర శత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను, మాతృ, పితృ వందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సంఘాలు ఎన్ని ఉన్నా ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయ వంతం చేసేందుకు అందరు ఐక్యంగా కృషి చేయాలని పిలుని చ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## అయ్యప్ప పడిపూజలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



**నవతెలంగాణ-సంగారెడ్డి**

జలంధర్ గురుస్వామి 18ఏండ్ల మాల ధారణ సందర్భంగా నారికేల మహా పడిపూజ కార్యక్రమాన్ని వచ్చేనెల నాలుగో తేదీన బైపాస్ రోడ్డు తెలంగాణ భవన్ ఎదురుగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని జలంధర్ గురుస్వామి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌కి మంగళవారం అందజేశారు. అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానం పలికారు.

## కిష్టయ్యపల్లిని సందర్శించిన ట్రైయినీ కలెక్టర్



**నవతెలంగాణ-జిన్నారం**

మండల పరిధిలోని కిష్టయ్యపల్లి పంచాయతీ గ్రామాన్ని ట్రెయినీ కలెక్టర్ మనోజ్ కుమార్ మంగళవారం సందర్శించారు. స్థానికంగా గల 166 సర్వేనెంబర్ భూముల రికార్డులు పరిశీలించారు. సదరు భూములకు సంబంధించి పొజిషన్ విషయమై ఫిర్యాదు వెళ్లడంతో ట్రెయినీ కలెక్టర్ పరిశీలించారు. అంతకు ముందు ఆయన జిన్నారం తాసిల్దార్ కార్యాలయంలో ఈ అంశంపై వివరాలను వాకబు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ వెంట జిన్నారం తహసీల్దార్ బిక్షపతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయప్రకాష్ నారాయణ, మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి పలువురు స్థానికులు సంబంధీకులు పాల్గొన్నారు.

## వట్‌పల్లిలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**నవతెలంగాణ-వట్‌పల్లి**

మండల కేంద్రమైన వట్‌పల్లి చౌరస్తాలో నేడు(బుధవారం) లయన్స్ క్లబ్ జోగిపేట వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ సనత్‌నగర్ సహకారంతో డాక్టర్ రవీందర్ గౌడ్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ప్రోగ్రాం చైర్మెన్ డాక్టర్ అనంతరెడ్డి, కో చైర్మెన్ పెద్దన్న లయన్స్ క్లబ్ అధ్యక్షులు మొహీనోద్దీన్ తెలిపారు. గురుకృప క్లినిక్ డాక్టర్ ఆర్.ఎం.పి వైద్యసాగర్ ప్రయివేటు ఆస్పత్రి వద్ద ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి బోధన్‌లోని లయన్స్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని.. అయితే వారి వయస్సు 35 ఏండ్లు పైబడి ఉండాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు కూడా ఇస్తారన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

బొల్లారం ఔటర్ సర్వీస్ రోడ్డు అండర్ బ్రిడ్జి కింద ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయింది. మంగళవారం నిర్జీవంగా పడి ఉన్న యాచకుడిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 55 ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మతి స్థిమితం సరిగా లేదని బొల్లారంలో, అండర్ బ్రిడ్జి కింద తిరుగుతూ నిత్యం భిక్షాటన చేసే వాడని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

## మంజీర నీటి పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



నవతెలంగాణ స్పందన

**నవతెలంగాణ-ఐడీఏబొల్లారం**

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని పలు కాలనీల్లో మంజీరా నీరు లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పైపులైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నదని మంగళవారం నవతెలంగాణ దిన పత్రికలో ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

## సంగారెడ్డి పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన రమేష్



**నవతెలంగాణ-సంగారెడ్డి**

సంగారెడ్డి పట్టణ సీఐగా ఎస్.రమేస్ మంగళవారం రోజున బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎం. భాస్కర్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

## పాడి పశువుల పోషణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



**నవతెలంగాణ-న్యాల్‌కల్**

రైతులు పాడి పశువుల పెంపకం మరియు పోషణ పట్ల తగు మెలకువలు పాటించి లాభాలు పొందాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి గణేష్ అన్నారు. ముంగి గ్రామంలో జిల్లా పశుసంవర్ధక శాఖ మరియు పశు గణాభివృద్ధి ఉచిత పశువైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు గర్భస్థ పరీక్షలు నిర్వహించి చికిత్స చేసి.. మందులు వేశారు. ఈ సందర్భంగా వారు రైతులకు పశువులలో వచ్చే గర్భకోశ వ్యాధుల గురించి వాటి వల్ల కలిగే నష్టాలు నివారణ గురించి అవగాహన కల్పించారు. ముంగి గ్రామంలో గర్భధారణ 29 టీకాలు, నట్టల నివారణ వేశారు. 18 పశువులకు గర్భస్థ పరీక్షలు చేశారు. 8 సాధారణ చికిత్సలు పశువులకు చేశారు. ఉచిత పశు వైద్య శిబిరాలను ఉపయోగించుకుని పశుసంపద పెంచాలని పశువైద్యాధికారి గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెబి కిషన్ రావు, సూపర్వైజర్ తుక్కారెడ్డి, గోపాలమిత్రలు జనార్దన్ రెడ్డి, ధనరాజ్, నాగప్ప, ఎస్‌ఓ మాజీద్ పాడి పశువుల రైతులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నవతెలంగాణ-పటాన్‌చెరు**

విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం నేడు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పట్టణ ఏఈ జగదీశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ పటాన్‌చెరు పట్టణ సబ్‌స్టేషన్ నుంచివచ్చే 11 కె.వి టౌన్ ఫీడర్ మెయింటెనెన్స్, కొత్త సర్వీసులు రిలీజింగ్ చేయడం, చెట్లు కొట్టి వేయటం వంటి మరమ్మతులు ఉన్నందున ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 02:00 వరకు 33/11కేవి పటాన్ చెరు పట్టణ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే విద్యుత్ (03:00 గంటలు)పాత మార్కెట్, గౌతమ్ నగర్,జాతీయ రహదారి, లక్క దొడ్డి, గోకుల్ నగర్,గొల్ల బస్తీ,చైతన్య నగర్ కాలనీ, శివాలయం, సీతారాంపురం, వెల్జోన్ డెన్సన్, డెన్సన్ తదితర కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు ఎలక్ట్రిసిటీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు తిరిగి అందజేత

**నవతెలంగాణ-మునిపల్లి**

పెద్దగోపులారం బస్వరాజ్, చింతల్‌గట్టు రాములు అనే ఇద్దరు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి తిరిగి వారికి మంగళవారం రోజున ఎస్ఐ రాజేష్ అందజేశారు. మొబైల్ ఫోన్ పోతే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని ఎస్ఐ సూచించారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయుడికి ఘన నివాళి



**నవతెలంగాణ-హత్నూర**

మండల పరిధిలోని సిరిపుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ టీచర్ సిహెచ్.భాస్కర్ ఇటీవలే గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ నరేందర్, ప్రధానోపాధ్యాయులు మంజుల, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్ రెడ్డిలు సిరిపుర పాఠశాలలో ఆయన చిత్రపటానికి మంగళవారం పూలమాలవేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హిందీ పండిత్ భాస్కర్ అకాల మరణం పాఠశాల విద్యార్థులకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం యువజన సంఘాల నాయకులు విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మేళాసంఘంలో ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం



**నవతెలంగాణ-మునిపల్లి**

మండలంలోని మేళాసంఘంలో ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం మంగళవారం జరిపారు. గ్రామ విధుల్లో విద్యార్థులతో కలిసి నినాదాలు చేయిస్తూ ప్రజలకు అవగాహన కలిగించే విధంగా ప్రదర్శన చేశారు. అనంతరం ఎంపీడీవో హరినందన్‌రావు మాట్లాడుతూ.. ఆరుబయట మలవిసర్జన కారణంగా ప్రజారోగ్యం, పర్యావరణం ప్రమాదంలో పడుతుందన్నారు. కాబట్టి ఆరు బయట మలవిసర్జన మానేయాలన్నారు. దీనిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి వాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయానికి రూ.50వేల విరాళం



**నవతెలంగాణ-జిన్నారం**

మండల పరిధిలోని మాదారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ లక్ష్మ గౌని సరిత సురేందర్‌గౌడ్ బేగంపేట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం రూ.50వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## డయాబెటిస్ రాకుండా యువత జాగ్రత్తలు తీసుకోవాలి

- మధుమేహం పట్ల అవగాహన కల్పించడం అభినందనీయం
- జిల్లా ట్రైని కలెక్టర్ మనోజ్



**నవతెలంగాణ-జోగిపేట**

యువత డయాబెటిస్ వ్యాధి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ట్రెయిని కలెక్టర్ మనోజ్ సూచించారు. లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మెన్ ఆకుల రాంబాబు అధ్యక్షతన మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డయాబెటిస్ అవగాహనా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధు మేహం గురించి లయన్స్ క్లబ్ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. మనిషికి మొదటగా వచ్చే వ్యాధుల్లో డయాబెటిస్ ఒకటన్నారు. ప్రపంచంలో ఎక్కువ శాతం జనాలు డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు. సరైన ఆహారం, వ్యాయామం చేయకపో వడం వలన ఈ వ్యాధి తొందరగా వచ్చే అవకాశం ఉందన్నారు. 35 నుంచి 40 ఏళ్ల యువతకు గుండె జబ్బులు, ఇతర వ్యాధులు వస్తున్నాయన్నారు. ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను లయన్స్ క్లబ్ తీసుకోవడం ఎంతో గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అశోక్, లయన్స్ క్లబ్ జిల్లా డయాబెటిస్ కార్యదర్శి డాక్టర్ కె. అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శిలు ఎస్. జగన్ మోహన్ రెడ్డి, ఆకుల రాంబాబు, జోన్ చైర్మెన్ రామకృష్ణ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అల్లే శ్రీకాంత్, జి.ఆర్. మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి జి.సంతోష్, సభ్యులు ఆర్. ప్రదీప్ గౌడ్, పి. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు,అభాగ్యులకు అండగా నిలబడదాం

- మాతృదేవోభవ ఆనాథాశ్రమ సేవలు ప్రశంసనీయం
- నీలం మధు ముదిరాజ్



**నవతెలంగాణ-పటాన్‌చెరు**

మానసిక రుగ్మతలతో బాధపడుతున్న అభాగ్యులకు అండగా నిలబడి చేయూతనందిద్దామని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల పరిధిలోని నాదర్‌గుల్ గ్రామ పరిధిలో గట్టు గిరి ఆధ్వర్యంలో మంగళవారం మాతృదేవోభవ ఆనాథ్రమంలో మానసిక రోగికి పునర్జన్మ ఇచ్చి ఆశ్రయం కల్పించే కార్యక్రమంలో నీలం మధు పాల్గొన్నారు. అంతకు ముందు ఆశ్రమ ఆవరణలో ఉన్న శివుడుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న అభాగ్యులతో పాటు ఆనాథలకు అండగా నిలబడి చేరదిస్తున్న మాతృదేవోభవ అనాథశ్రమ సేవలను కొనియాడారు. తన వంతుగా వారికి సంపూర్ణ సహకారాలను అంది స్తానన్నారు. సామాజిక సేవలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరూ ఇలాంటి సంస్థలకు చేయుతానందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆశ్రమంలో 135మందికి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం మల్లేష్, భరత్,శ్రీధర్,బాలు,ఆశ్రమంసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ఇసుక దందా..

- ఇసుక ఫిల్టర్లు కూల్చినా.. ఆగని రవాణా
- నక్క వాగునుంచే దర్జాగా రోడ్డు మార్గం





**నవతెలంగాణ-కంది**

మండలంలోని బ్యాతోల్, ఏర్దనూర్, బేగంపేట్ తదితర గ్రామాల్లో కృత్రిమ ఇసుకను తయారు చేసి బడబాబులు దండిగా దండుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుక దందా చేస్తున్నారు. నక్కవాగు పరిసర ప్రాంతాలనుంచి రోజుకు దాదాపు ముప్పై లారీలు, ఇరవై ట్రాక్టర్‌లతో పటాన్‌చెరు, హైదరబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అధికారులు ఎన్నిసార్లు ఫిల్టర్లను కూల్చి వేసినా.. అక్రమార్కుల ఆగడాలు ఆగడం లేదు. భారీ లారీల్లో ఇసుకను తరలించడంతో రహదారులు సైతం ధ్వంసం అవుతున్నాయి. లక్షలు ఖర్చు చేసి వేసిన రోడ్లు గుంతలుగా మారడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడు తున్నారు. నిర్లక్ష్యంగా వ్యహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పొగాకుతో ఆరోగ్యానికి ముప్పు



**నవతెలంగాణ-చౌటకూర్**

పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ పొగాకు వాడకంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్వైజర్ విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా యువకులు, పొగాకు సేవించే వారికి అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరెట్, జరదా, తంబాకు, పాన్ మసాలా లాంటి వాటిని ఉపయోగించొద్దన్నారు. వీటి వాడకం వల్ల మనుషుల్లో హైపర్ టెన్షన్ నోటి క్యాన్సర్, శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని రూ.200 జరిమానా విధిస్తారన్నారు. పొగాకు ఉత్పత్తుల పోస్టర్లను అడ్వర్టైజ్‌లను వేయడం సెక్షన్ 5 ప్రకారం నేరమన్నారు. ఈ చర్యకు రెండేండ్ల పాటు జైలు శిక్ష విధిస్తారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు శివంపేట పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పొగాకు వాడకానికి ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని అప్పుడే వారి ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశం, ఉపాధ్యాయలు రాములు, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.















**నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్**

నారాయణఖేడ్ పట్టణంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఇంటి వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ.. దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ అని అన్నారు. భారతీయ, రాజకీయవేత్త, భారతదేశంలో ఉక్కు మహిళగా బ్యాంకులను జాతీయం చేసిన ఘనత వారికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్లోల చంద్రశేఖర్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి, పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, బొజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, యాదవ్ రెడ్డి మాజీ సర్పంచ్, ఆనంద్ స్వరూప్ శెట్కార్ మున్సిపాలిటీచైర్మెన్ తదితరులు పాల్గొన్నారు..

**పటాన్‌చెరు :** మండలంలోని చిట్కూల్ గల ఎన్ఎంఆర్ క్యాంపు కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు.ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమం, అభివృద్ధి ని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచి పోయారన్నారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.ఆ స్ఫూర్తితోనే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నదన్నారు.

పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా జరిపారు. మండల పరిషత్ ఆవరణ ముందు ఉన్న ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యక్షంగా పరోక్షంగా నాలుగు లక్షల మంది కార్మికులకు జీవనోపాధి లక్షలాది ఎకరాలకు సాగు తాగునీరు అందించిన ఘనత మాజీ ప్రధాని ఇందిరాగాంధీకే దక్కుతుం దన్నారు. మెదక్ జిల్లా నుండి పోటీచేసి ప్రధాని పీఠాన్ని అవరోదించాక.. ఉమ్మడి మెదక్ జిల్లాకు ముఖ్యంగా పటాన్‌చెరు, సంగారెడ్డి జహీరాబాద్ పారిశ్రామిక వాడలో బిడిఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలను నెలకొల్పి.. వందలాది ప్రైవేటు పరిశ్రమలు రావడంతో వేలాదిమందికి జీవనోపాధి కల్పించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. అలాగే జిల్లాలో సాగునీటి, తాగు నీటి ప్రాజెక్టులను నిర్మించి ఒదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సంజీవరెడ్డి మాజీ టీపీసీసీ కార్యదర్శి మతిన్, మాజీమార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్కే అథిక్, మైనార్టీ అధ్యక్షులు ఫయాజ్ నాయకు లు రవిముదిరాజ్, యువరాజ్, రతన్‌సింగ్, అక్షిథ్ తదితరులు పాల్గొన్నారు.

**ఐడీఏబొల్లారం :** బొల్లారంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని బాలాజీనగర్ కాలనీలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమం, అభివృ ద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిన మహా నాయకురాలు.. భారతదేశ తొలి మహిళా ప్రధాని, భారత రత్న ఇందిరా గాంధీ అని అన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి నాయక త్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, జీఎంఆర్ యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

**జోగిపేట :** దేశ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి పూలవాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. జగన్మో హన్ రెడ్డి, వైస్‌చైర్మన్ ప్రవీణ్, కౌన్సిలర్లు ఎస్.సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, రంగ సురేష్, డాకూరి శివశంకర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

**జహీరాబాద్ :** జహీరాబాద్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లా డుతూ.. ఇందిరా గాంధీ స్ఫూర్తితో ముందుకు సాగుతూ సంక్షేమ పథకాలన్నింటిని ప్రజల వద్దకు చేర్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నియో జకవర్గ అధ్యక్షులు జమిలాల్లోద్దిన్, మాజీ వైస్ ఎంపీపీ వి.రాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కె.జగదీశ్వర్ రెడ్డి,అక్షయ్ జాడే,రాములు,బర్కత్ నిజాం తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మడిదల :** మండల పరిధిలోని బొంతపల్లిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మొహ్మద్ ఆజాం ఆధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మండల మైనా ర్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ అజార్, తాజా మాజీ ఎంపీ టీసీలు సురభి నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వీరారెడ్డి తదితరులున్నారు.

## స్వాతంత్ర్య సమరయోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి

● తపస్

**నవతెలంగాణ-చేగుంట**




గొప్ప స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి అని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నావత్ సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ రెడ్డి పల్లి పాఠశాలలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి బనారస్‌లోని మరాఠీ కర్హాడే బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినది అని, 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో కీలక పాత్ర పోషించారని, నా వంటిలో రక్తపు చుక్క, నా చేతిలో ఖడ్గం ఉన్నంతవరకు ఏ విదేశీయులు నా భారతదేశాన్ని ఆక్రమించుకోలేరు అన్న మాటలు నాటి జాతీయ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, ఉపాధ్యక్షులు దేశపతి కృష్ణమూర్తి, కార్యదర్శి సుమతి, మండల అధ్యక్షులు వెంకటేష్ , సుమలత, రజనీదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలు

**నవతెలంగాణ-చేగుంట**



భారతదేశ తొలి మహిళ ప్రధానమంత్రి భారతం త్న స్వర్గీయ ఇందిరా గాంధీ 107వ జయంతి వేడుకలను చేగుంట పట్టణ కేంద్రం గాంధీ చివరస్త వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ చిత్రపటానికి పూలమాలవేసి కేకు కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజల కోసం కానా మకాన్ (భోజనము, ఇల్లు) ప్రతి పేదవారికి అందించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు. వ్యవసాయ భూములను పేదవారికి పంచారని, బ్యాంకులను జాతీయం చేయడం వలన ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కురుమ లక్ష్మి, మాజీ దుబ్బాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అంకన్నగారి సాయి కుమార్ గౌడ్, యువ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, మహుమద్ నదీమ్ అలీ, మహేష్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు

**నవతెలంగాణ-నిజాంపేట**



మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో వరి కొయ్యలను పొలంలోనే కాల్చడం వల్ల జరిగే నష్టాలను వ్యవసా య అధికారు లు రైతులకు వివ రించారు. దాని వలన సేంద్రి య కార్బన్ శాతం భూమిలో తగ్గిపోతుంది. అలాగే పంటకు సహకరించే బ్యాక్టీరియా, సూక్ష్మ జీవులు చనిపోవడం వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. నేలలు నిస్సారంగా మారి పంటదిగుబడులు తగ్గుతాయి. ఈ కార్యక్రమములో గ్రామ రైతులు, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

## 21న మండల స్థాయి చెకిముఖి పోటీలు

**నవతెలంగాణ-పాపన్నపేట**



మెదక్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఈనెల 21వ తేదీన మండల స్థాయి చెకి ముఖి పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మోహన్ రావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆయా మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతులలో పాఠశాల స్థాయి చెకి ముఖి పోటీలలో ప్రథమ స్థానం సాధించినవారు మండల స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

**నవతెలంగాణ-నిజాంపేట**



మండల పరిధిలోని కాశీంపూర్ తాండకు చెందిన జి.రాజుకు రూ.30వేల చెక్కును అందజేసినట్లు రజక్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీల కనకరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులతో ఎంతోమంది పేద వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎంఆర్ చెక్కులు మంజూరు చేయించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ విఠల్, రామ్ చందర్, గోపాల్, మహిపాల్, మోనియ, బాల్యాసేవ, చందర్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**నవతెలంగాణ-నిజాంపేట్**



మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన పిట్ల బాబుకు మంజూరైన రూ.13500ల సీఎం ఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాతి లక్ష్మా గౌడ్ బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో నిరుపేద కుటుంబాలు అనా రోగ్యాలతో బాధపడుతున్నారన్నారు.కార్పొరేట్ వైద్యంలో చికిత్స చేసుకున్న బాధితులకు సీఎంఆర్ చెక్కులను అందజేసి ఎమ్మెల్యే రోహిత్ రావు ఆదుకుంటున్నారన్నారన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం గౌడ్, మెట్టు వెంకట్, కొమ్మట దేవరాజ్, మంగలి దేవరాజ్, మద్దికుంట శ్రీనివాస్, దేశెట్టి రాజు, పిట్ల మహేష్, కొమ్మాట చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

**నందిగామలో..**



సీఎం రేవంత్ రెడ్డి సహాయనిధి నుంచి మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు మండల సీనియర్ నాయకులు ఆకుల బాలయ్య చేతుల మీదుగా సంగు బాలరాజ్ వీరబోనా జలమంద రాజ్ వారి కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమములో గ్రామ అధ్యక్షులు అంజిరెడ్డి ఎంఎస్ఎస్ఓ లింగస్వామి, మాజీ ఎంపీటీసీ సురేష్, యూత్ నాయకులు, హృసికేష్, సంగు దుర్గయ్య, కుమార్, ప్రకాష్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## నవ భారత నిర్మాత ఇందిరా గాంధీ

**నవతెలంగాణ-నార్సింగి**



భారతరత్న మాజీ భారత ప్రధాని దివంగత ఇందిరా గాంధీ 107వ జయంతి ఉత్సవాలు మండల పరిధి గ్రామమైన శేరీపల్లిలో మెదక్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగర్ల గోవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గోవర్ధన్ మాట్లాడుతూ భారత దేశ తొలి మహిళా ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ అని, నాలుగు పర్యాయాలు ప్రధాన మంత్రిగా గెలిచిన ఏకైక నాయకురాలని, దేశం కోసం తన ప్రాణం అర్పించిన మహనీయురాలని కొనియాడారు. ఆధునిక భారత నిర్మాత అని, గరీబీ హటావో అనే నినాదంతో దేశంలో పరిశ్రమల విప్లవం తెచ్చిన మధ్య తరగతి నిర్మాత అని గుర్తు చేశారు. ఆమె సేవలు మరవరానివని, నేటి నాయకులు ఆమెను ఆదర్శంగా తీసుకుని, ఆమె ఆదర్శాలను భావి తరాలకు అందించటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్ళ కృష్ణా గౌడ్, మాజీ ఉప సర్పంచ్ బాలాజీ, సందిగారి నరసింహులు గౌడ్, శ్రీరామ్ మల్లేశం, పూసల శ్రీను, పోకల యాదగిరి, సాయిలు, లక్ష్మి నరసింహులు, యూత్ సభ్యులు బాలకృష్ణ గౌడ్, మోతీలాల్, చెప్యాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదుల పెట్టే

**కొత్తపల్లి సొసైటీ చైర్మెన్ త్యార్ల రమేష్**



**నవతెలంగాణ-పాపన్నపేట**

రైతుల సమస్యల కోసం ఫిర్యాదులు పెట్టే ఏర్పాటు చేశారు. కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం పాలక వర్గ చైర్మన్ త్యార్ల రమేష్. 71వ సహకార సంఘ వారోత్సవాల సందర్భంగా మంగళవారం సొసైటీ మాజీ మేనేజింగ్ డైరక్టర్లు, జిల్లా కో ఆపరేటివ్, రిటైర్డ్ సొసైటీ ఉద్యోగులతో సమన్వయ సంఘ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి సొసైటీ రైతు ఫిర్యాదు రోజులపెట్టె ఏర్పాటు చేసి, 15 రోజుల ఒకసారి ఇద్దరు డైరక్టర్లు, సొసైటీ అధికారుల సమక్షంలో తెరుస్తామని చెప్పారు. న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. సొసైటీ పరిధిలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెంట, వెంటనే తూకం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సొసైటి మొదటి మేనేజింగ్ డైరక్టర్ ఫణిరాజ మూర్తి మాట్లాడుతూ 1982లో సొసైటీ అభివృద్ధికి అనేక కొత్త నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ఆర్థిక వినిమయ సేవలతో రాష్ట్రంలో ముల్కనూరు తర్వాత రెండవ ఆదర్శ సొసైటీగా అభివృద్ధి చెందిందన్నారు. ఇతర ఎండీలు గోపాల్ రావు, విశ్వనాథం, ఎల్విఎస్ శాస్త్రి, మాధ్యూ, ప్రభాకర్ రెడ్డి, బాలరాజు, వెంకటేశ్వర్లు సొసైటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన సూచనలు చేశారు. డీసీఓ కరుణ, డీసిఏఓ కరుణాకర్ మాట్లాడుతూ కొత్తపల్లి సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ బంకు, గోదాంలు, రైస్ మిల్లు, మంచి లాభాలతో నడుస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎండీలు, రిటైర్డ్ ఉద్యోగులు అధికారులను చైర్మన్ రమేష్ సన్మానించారు.

## గూడెం గడ్డ గ్రామాన్ని ప్లాస్టిక్‌రహిత గ్రామంగా చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**నవతెలంగాణ-నర్సాపూర్**






నర్సాపూర్ నియోజకవర్గంలోని గూడెం గడ్డ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ మంచు నగేష్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం నర్సాపూర్ మండల పరిధిలోని గూడెం గడ్డ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, కుటుంబ పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అంతేకాకుండా మరుగుదొడ్డి లేకుంటే బ్రతుకులు ఆగమని మరుగుదొడ్డి ఉంటే బ్రతుకంతా భోగం అనే సూక్తిని ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలు ప్రతి ఒక్కరు 100శాతం మద్యపానం నిషేధానికి కట్టుబడి ఉండాలని, అలాగే 100శాతం మరుగుదొడ్ల వినియోగం, 100శాతం ట్యాక్స్ కలెక్షన్స్, 100శాతం తడి పొడి చెత్త వేరు చేయడం, 100శాతం ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దుకోవడం అనేది గ్రామ ప్రజల ధైర్య సాహసాలు కృషి నిరంతరం పర్యవేక్షణ పట్టుదల ఎంతో అనిర్వచనీయమైనదని ఆయన కొనియాడారు. అదేవిధంగా గ్రామాలలోని వివిధ శుభకార్యాలకు ప్లాస్టిక్ గ్లాసులు ప్లాస్టిక్ ప్లేట్లు వినియోగించి క్యాన్సర్ బారిన పడకుండా ఉండడానికి ముందస్తు చర్యగా స్టీల్ బ్యాంకును ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ బ్యాంకు ద్వారా గ్రామంలో అవసరమున్న కుటుంబాలకు గ్లాసులు ప్లేట్లు మిగతా పాత్రలు గ్రామ పంచాయతీ నుంచి ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఆర్డిఓ మైహిపాల్ రెడ్డి, తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, ఏపీఎం గౌరీ శంకర్, ప్రధానోపాధ్యాయురాలు స్వప్న, గ్రామ కార్యదర్శి నాగేష్, ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తారా సింగ్, శేఖర్, ఐకెపి సీసీలు భాగ్య, ప్రవీణ, ఆంజనేయులు, దేవి సింగ్, రవీందర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం కొనుగోలు

● తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

**నవతెలంగాణ-మనోహరాబాద్**



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బుధవారం నుంచి సన్న వరి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దండుపల్లి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన సన్న వరి ధాన్యంను మిషన్ ద్వారా వ్యవసాయ శాఖ ఏఈఓ నరేందర్ గౌడ్ పరిశీలించారు. బుధవారం నుంచి సన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు సన్నధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలని సూచించారు. సన్నధాన్యంకు ప్రభుత్వం నుంచి రూ.500లు బోనస్ కూడా రైతుల ఖాతాలో జమచేయడం జరుగుతుందని సూ చించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మెట్టు బాల కృష్ణారెడ్డి, ఆర్ఐ దీక్షిత్ లతోపాటు పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**నవతెలంగాణ-హవేలీ ఘనపూర్**




మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహసిల్దార్ సింధు రేణుక పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని గ్రంథాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిల్లల జీవితాల్ని మార్చే గొప్ప శక్తి గ్రంథాలయాలకు ఉందని, విద్యార్థులకు గ్రంథాలయాలు మేధో శక్తి అని తెలిపారు. పాఠశాల లైబ్రేరియన్ బుర్ర సంతోష్ గ్రంథాలయం మీద రాసిన కవిత అందర్నీ ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మధు మోహన్, ఏఎస్ఐ రాజు, ఏటిపి నాగరాజు, డిడబ్ల్యు అను రాధ, మిగతా ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

## 26న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

● సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్స్, రైతు సంఘాల పిలుపు

**నవతెలంగాణ-మెదక్ టౌన్**



కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, వృత్తి సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మల్లేశం కోరారు. కార్మిక, రైతు, వృత్తి సంఘాలు ఆధ్వర్యంలో బుధవారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎ.మల్లేశం మాట్లాడుతూ 2019 సంవత్సరంలో రైతులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2019 నవంబర్‌లో ప్రారంభమైనటు వంటి రైతుల ఢిల్లీ పోరాటం 2020 నవంబర్ వరకు కొనసాగిందన్నారు. చివరగా కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి రైతుల నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్టు పార్ల మెంటులో ప్రకటించిందన్నారు. అప్పటి నుంచి వరుసగా ప్రతి సంవత్సరం నవంబర్ 26 తేదీ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసారి కూడా నవంబర్ 26వ తేదీన కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ట్రేడ్ ప్లాట్ఫారం యూనియన్లు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలో కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 లు నిర్ణయించాలని, అసంఘటితర కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఉపాధి హామీ కూలీలకు రూ.600లు వేతనం నిర్ణయిస్తూ 200 పనిదినాలు పెంచాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లాలో కూడా నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగు తుందన్నారు. పారిశ్రామిక కార్మికులు పనిచేస్తున్న స్థలంలోని నిరసన కార్యక్రమాలు చేయాలని ఇతర రంగాల కార్మికులు పని ప్రదేశాలలోనే నిరసన తెలుపాలన్నారు. మెదక్ జిల్లాలో ఉన్న కార్మిక వర్గానికి, వ్యవసాయ కూలీలకు, రైతాంగానికి, వృత్తిదారులందరికి కూడా ఆల్ ట్రేడ్ యూనియన్లు, రైతు, వృత్తి సంఘాలు ఈ నవంబర్ 26న నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు, కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, యేసయ్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం, రైతు సంఘం జిల్లా నాయకులు గౌరీ, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి లచ్చ గౌడ్, నాయకులు నాగమణి, రాములు, సత్యం, పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ కస్టోడియన్ భూములను రైతులకు, పేదలకు పంచి పట్టాలివ్వాలి

● సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ

**నవతెలంగాణ-నర్సాపూర్**



గుమ్మడిదల మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సర్వే నెంబర్ 1 నుంచి 59లో 1000 ఎకరాల వరకు ఉన్న కస్టోడియన్ భూములను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, మెదక్ జిల్లా కార్యదర్శి టీ.ఎం ఖాలిక్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ గత 50 సంవత్సరా లుగా ప్రభుత్వ కస్టోడియన్‌గా ఉన్న భూములలో రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. తమకు భూమిపైన హక్కులు కావాలని పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని అనేక సందర్భంలో రైతులు ప్రభు త్వాలకు మొరపెట్టుకున్న ఇప్పటివరకు వారికి పాసుపుస్తకాలు ఇవ్వలేదు. ఈ కస్టోడియన్ భూములలో ఎనిమిది వందల ఎకరాలు ఇప్పటికీ ఖాళీ గానే ఉన్నది. ఈ ఖాళీగా ఉన్న భూములను ఆ గ్రామాల్లో ఉన్నటువంటి పేద ప్రజల కు పంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని తక్షణమే అధికారులు గ్రామాన్ని సందర్శించి సాగులో ఉన్న రైతులకు పట్టా పుస్తకాలు ఇవ్వడంతో పాటు మిగిలి ఉన్న భూములను పేదల ప్రజలకు చెందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో అనేక గ్రామాలలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూములను, భూస్వాముల భూములను పేదల ప్రజలు స్వాధీనం చేసుకున్నారు తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ దేవాదాయ, వక్ఫ్, భూదాన్ భూములను కలెక్టర్ స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతోని కుమ్మక్కు అయ్యి బినామీలను సృష్టించుకుని అక్రమంగా వారికి పట్టాలి ఇవ్వడం జరిగింది. ఈ మధ్యనే ఈ భూ కుంభకోణంపై ఈడి జిల్లా స్థాయి కలెక్టర్‌గా పనిచేసిన అధికారులను పిలిపించి విచారించి వారి పైన చర్యలకు సిద్ధమవుతున్నది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడైతే ప్రభుత్వ భూములు కబ్జాకు గురై అయినవో వాటిపైన సమగ్రమైనటువంటి విచారణ జరపడం కోసం రిటైర్డ్ జడ్జితోని కమిటీ వేసి భూకబ్జాదారులు చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వము స్వాధీనం చేసుకొని ప్రజా అవసరాల కోసం ఉపయోగిం చాలని భూమిలేని పేద ప్రజలకు పంచాలని డిమాండ్ చేశా రు. తెలంగాణ రాష్ట్రంలో ధరణి వచ్చిన తర్వాత చాలా ప్రభుత్వ భూములను దొంగ చాటుగా అక్రమంగా అధికార పార్టీ నాయకుల అనుచరుల పేరు మీద పట్టాలు చేయిం చుకోవడం జరిగింది. ఇటువంటి భూకబ్జాదారుల పైన క్రిమి నల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మహ బూబ్ ఖాన్, మోహన్ రెడ్డి, దేవేందర్ అదే విధంగా గ్రామంలో రైతులు పేద ప్రజలు పాల్గొన్నారు.

## కౌన్సిలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయాలి

● వైద్య కళాశాలలో ల్యాబ్, హాస్టల్స్‌లో ఎలక్ట్రికల్, మిగతా పనులను పూర్తి చేయాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

**నవతెలంగాణ-మెదక్ టౌన్**



వైద్య కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లమా ఇన్ అనస్తీసియా టెక్నీషియన్ కోర్సుల కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను కౌన్సిలింగ్ ద్వారా రిక్రూట్మెంట్ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ పట్టణంలో విస్తృతంగా పర్యటించి వైద్య కళాశాల, పారా మెడికల్ సిబ్బంది నియామకం, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు భవనము సమకూర్చుటపై సంబంధిత వైద్య కళాశాలను, నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు సంబంధించిన భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా వైద్య కళాశాలలో ల్యాబ్స్‌ను పరిశీలించి ఎలక్ట్రికల్ వర్క్ త్వరితగతిన పూర్తి చేయాలని, హాస్టల్స్‌లో మరుగుదొడ్లు ఇంకా మిగిలి ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ తాగునీరు వైద్య కళాశాలకు వచ్చేలా చూడాలని సూపరింటెండెంట్ అభ్యర్థన మేరకు మిషన్ భగీరథ అధికారులతో సంప్రదించి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామని చెప్పారు. నర్సింగ్ కాలేజ్ ఏర్పాటుకు భవనాన్ని సమకూర్చుటలో భాగంగా బిల్డింగ్ ఓనర్‌తో సంప్రదించి చర్యలు చేపడతామన్నారు. నర్సింగ్ స్టూడెంట్స్ జాయిన్ అవుతున్నారని డిసెంబర్ నాటికి క్లాసులు ప్రారంభించాల్సి ఉందన్నారు. వైద్య కళాశాలలో పారా మెడికల్ సిబ్బంది గతంలో ఇచ్చిన ప్రకటన ఆధారంగా ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని ఈనెల 25 లోపు కౌన్సిలింగ్ నిర్వహించి రిక్రూట్మెంట్ చేయాలని సంబంధిత సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కమలాదేవి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్‌లకు సన్మానం

● తూప్రాన్ ఆర్‌డీఓ

**నవతెలంగాణ-మనోహరాబాద్**



ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను 100 శాతం పూర్తిచేసిన ఏన్యుమరేటర్లను తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి శాలువాలతో సత్కరించారు. మనోహరబాద్ మండల పరిషత్ కార్యాలయంలో లింగారెడ్డి పేట్ గ్రామ పంచాయతీ నందు పూర్తిస్థాయిలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా 446 కుటుంబాల సర్వే పూర్తి చేసినందుకు జయచంద్రా రెడ్డి, ఎంజిఎస్ఆర్ఇజిఎస్ సీనియర్ మేట్ లక్ష్మి, భవాని, అంగన్వాడీ టీచర్, సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్‌లను మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే మనోహరబాద్ మండలంలో ఇప్పటివరకు 94 శాతం సర్వే పూర్తి చేయజేశారని ఆర్డిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఎంపీఓ లక్ష్మి నర్సింలు, శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలు చాలా ముఖ్యం

● ఎక్స్ ప్రెస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ

**నవతెలంగాణ-మనోహరాబాద్**




విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని జీఎమ్ఆర్ పోచంపల్లి ఎక్స్ ప్రెస్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరాబాద్ లో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవ సందర్భంగా జరిగిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు అన్ని రకాల పోటీలలో పాల్గొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులలో కూడా మొదటి స్థానంలో నిల వాలని చదువును కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ వర లక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం ఎక్స్క్యూటివ్ శ్రీనివాస్, ప్రధా నోపాధ్యాయురాలు రెహానా సుల్తాన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి ప్రమాదాలకు కారణం కావద్దు

● కొనుగోలు కేంద్రాల్లో త్వరగా తూకం వేసి ధాన్యాన్ని తరలించాలి

● తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి

**నవతెలంగాణ-మనోహరాబాద్**



రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోసి ప్రయనికుల ప్రమాదాలకు కారణం కావద్దని తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. మనోహరాబాద్ మండలంలోని దండుపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద రోడ్లపై ధాన్యాన్ని అర పోసిన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రోడ్లపై ధాన్యాన్ని ఆరిపోవడంతో అనేక ప్రమాదాలు జరిగే విలువైన ప్రాణాలను కోల్పోయారని రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోయొద్దని సూచించారు. అలాగే దండుపల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసే మిల్లుల తరలించి ప్రమాదాలను అరికట్టాలని డీఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మెన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, వ్యవసాయ శాఖ ఏఈఓ నరేందర్ గౌడ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

**డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీరామ్**

**నవతెలంగాణ-వెల్దుర్తి**



మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ మంగళవారం సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మందుల నిలువల స్టాగ్ రిజిస్టర్ ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని డాక్టర్లకు ఏఎన్ఎంలకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. హాస్పటల్లో ల్యాబ్ ఏర్పాటు చేసి మేరుగైన వైద్యం కోసం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. 24 టెస్టుల కోసం అధునాతనమైన పరికరాల తోటి ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం మందులను అందుబాటులో ఉంచుతామన్నారు. పాము, కాటు, కుక్క కాటు వంటి వ్యాక్సిన్లను ఎప్పటికప్పుడు నిల్వ ఉంచుతామన్నారు. వందరోజుల ప్రోగ్రాం జనవరిలో ప్రారంభం కాబోతుందన్నారు. టీబీ రోగులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామన్నారు. 60 ఏళ్లకు పైబడిన వారికి బీసీజీ ఇంజక్షన్లను జనవరిలో ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ నవీన్, డాక్టర్లు శిరీష, సౌజన్య, సూపర్వైజర్లు, ఏఎన్ఎం వైద్య సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఆర్‌డీఏ అధికారి

**నవతెలంగాణ-నర్సాపూర్**



మండలంలోని చిన్న చింతకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సిహెచ్ శ్రీనివాస్ రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ ఎంట్రీ, రైతులకు చెల్లింపు వివరాలు, లారీలు వెంట వెంటనే మిల్లు నుండి కాలి చేసుకుని రావడం లాంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సన్నధాన్యం కొనుగోలు కూడా జరుగుతున్న తీరును చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి తో పాటు ఏపీఎం మార్గం గౌరీశంకర్, సిసి ప్రవీణ, సీఏలు నాగరత్న లక్ష్మి గ్రామ సంఘం లీడర్లు రైతులు పాల్గొన్నారు

## విజేతలుగా జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

**నవతెలంగాణ-వెల్దుర్తి**



రంగోత్సవం సెలబ్రేషన్ ఆర్ట్స్ కాంపిటేషన్‌లో, ముంబై వారు నిర్వహించిన జాతీయస్థాయి ఆర్ట్స్ కాంపిటీషన్లో జెడ్‌పిహెచ్ఎస్ వెల్దుర్తి పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో వివిధ కేటగిరిలో 8 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, 5 మంది విద్యార్థులు సిల్వర్, 5 మంది విద్యార్థులు బ్రాస్ మెడల్స్ గెలుపొంది వెల్దుర్తి పాఠశాల పేరును జాతి స్థాయిలో నిలిపారని గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మంగళవారం ఉపాధ్యాయుల బృందంతో కలిసి బహుమతుల ప్రధానం చేసి విద్యార్థులకు అభినందనలు తెలిపారు. దీనికి సంబంధించిన ఇన్చార్జి ఉపాధ్యాయురాలు సిహెచ్. జయసుధను పాఠశాల ఉపాధ్యాయుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, నరసింహారెడ్డి, చార్లెస్, అర్చన, నవనీత, అమూల్య, సునీత, శైలజ, వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్‌లో పారిశుద్ధ్య చర్యలు

- కమిషనర్ గోల్కొండ నరసయ్య



**నవతెలంగాణ-గజ్వేల్**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. మంగళవారం మున్సిపల్ సిబ్బంది మురికి కాలువలు శుభ్రం చేస్తున్న వాటిని ఆయన పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో కేటాయించిన మున్సిపల్ సిబ్బంది క్రమం తప్పకుండా పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. దోమల, డెంగ్యూ నివారణకు చర్యలు తీసుకుంటున్న మన్నారు. వార్డుల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అని చెప్పారు. ఇంటి పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకుంటే దోమలు ఈగలు నివారణకు తోడ్పాటు అందించిన వారు అవుతారని చెప్పారు. అంతేకాకుండా దోమల పిచికారిని కూడా చేయిస్తున్నామన్నారు. మురికి కాలువలో గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించడం వల్ల మురికి నీరు నేరుగా వెళ్ళిపోతే ఎలాంటి సమస్యలు ఉండవని అన్నారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డుల్లో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉంచడమే మున్సిపల్ లక్ష్యమని పేర్కొన్నారు.

## సీఐటీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



**నవతెలంగాణ-ములుగు**

ములుగు సెక్షన్ కమిటీ సమావేశం మంగళవారం శ్రావణ్ కుమార్ అధ్యక్షతన అడవి మజీద్ సబ్ స్టేషన్‌లో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంటిపల్లి సధాకర్ హాజరై మాట్లాడుతూ జనవరి 4, 5 తేదీల్లో రాష్ట్ర మహాసభలు సిద్దిపేటలో జరగబోతున్నాయి. వాటిని కార్మిక అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్తులో వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం సెక్షన్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సెక్షన్ అధ్యక్షుడు కె. వెంకటేష్ ఏఎల్ఎం, కార్యదర్శిఏ.ప్రభాకర్, ఉపాధ్యక్షులు నవీందర్, వీరేశం, వెంకటేష్, అరవింద్, కోశాధికారి నాగరాజు, జాయింట్ సెక్రటరీలు నిఖిల్, దేవయ్య, సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ వినోద్, నరేష్, శ్రవణ్ ములుగు సెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

## పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు చెల్లించండి



**నవతెలంగాణ-గజ్వేల్**

పెండింగ్లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలలుగా గ్రామపంచాయతీల్లో నిధులు లేక, నిధులు ఉన్న గ్రామపంచాయతీలో చెక్కులు పంపించిన కార్మికులకు మాత్రం వేతనాలు పడటం లేదని అన్నారు. నేటి రోజుల్లో రోజువారి ఖర్చులు పెరగడం, వైద్యం ఖర్చులు పెరగడంతో గ్రామపంచాయతీ కార్మికులు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రత్యక్షంగా వేతనాలు అందజేస్తామని తెలిపిన సరియైన విధానం లేకపోవడంతో గ్రామాల్లో చెక్కులు కొట్టడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని గ్రామపంచాయతీ కార్మికులందరికీ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ గ్రామ పంచాయతీల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, రంగారెడ్డి, వెంకట చారి పాల్గొన్నారు.

## సాధారణ మహిళ..అసాధారణ శక్తి...ఇందిర

- ఇందిర గాంధీ జయంతిలో ఏఎంసీ చైర్మెన్ క్రిష్ణ
- మండలాధ్యక్షులు అధ్వర్యంలో జయంతి వేడుకలు



**నవతెలంగాణ-బెజ్జంకి**

సాదారణ మహిళగా జీవనం ప్రారంభించి, ప్రధానిగా అసాధారణ శక్తిగా ఎదిగిన మాజీ ప్రధాని ఇందిర గాంధీ ఉక్కు మహిళగా పేరు ప్రఖ్యాతలు గడించిందని ఏఎంసీ చైర్మెన్ పులి క్రిష్ణ కొనియాడారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి అధ్వర్యంలో మాజీ ప్రధాని ఇందిర గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బీసీ సెల్ మండలాధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్, నాయకులు శానగొండ శరత్, జెల్లా ప్రభాకర్, బైర సంతోష్, నవీన్, చెన్నారెడ్డి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు ఇరువైపులా చెట్లను తొలగించాలని వినతి



**నవతెలంగాణ-మద్దూరు**

రోడ్లకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాలని మండలంలోని రేబర్తి పాఠశాల ఉపాధ్యాయులు ఎంపీడీవో రామ్మోహన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం చేర్యాల మండలంలో వేచరేణి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు వృత్తిరీత్యా చుంచనకోట పాఠశాలకు వెళ్తుండగా రోడ్డు పక్కకు ఉన్న చెట్లల్లో కోతులు ఉండడంతో కోతులు అడ్డు రావడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడని తెలిపారు. ప్రభుత్వం వెంటనే దీనిపై దృష్టి పెట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బి.చంద్ర భాను, బి చంద్రారెడ్డి, జై సంపత్ కుమార్, వై రవి ,కె శ్రీనివాసరెడ్డి, బి నర్సింలు, రఫుత్, జి.కవిత, పి.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి



**నవతెలంగాణ-నంగునూరు**

మండలం పాలమాకుల గ్రామంలోని నర్సరీ, బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి దేవకీ దేవి సందర్శించారు. బృహత్ పల్లె ప్రకృతి వనంలోని మునగ చెట్లను ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామంలోని డంపు యార్డును సందర్శించి తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల ఇంచార్జి ఎంపీడీవో ప్రభాకర్ రావు, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిత, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

- జిల్లా వైద్య అధికారి పల్వాన్ కుమార్



**నవతెలంగాణ-వర్గల్**

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారి పల్వాన్ కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగులను ఆయుష్ మాన్ ఆరోగ్య మందిర్ ద్వార కలిగే సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఫార్మాసి, మెడికల్ ల్యాబ్‌లోని రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కొత్త ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిబ్బంది రోగులకు తమ సేవలను అందించాలని, అవసరమైన సమయంలో మాత్రమే యాంటీ బయాటిక్స్ వాడాలని సూచించారు. ఈ తనిఖీలో డీఎంఓ శ్రీనివాస్, వైద్య అధికారిని మేరీ మీణ కుమారి, ఆయుష్ డాక్టర్ శిరీష, సీహెచ్ఓ రవీందర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగం గురించి అందరు తప్పక తెలుసుకోవాలి

- డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి




**నవతెలంగాణ-సిద్దిపేట**

రాజ్యాంగం చాలా గొప్పదని, దాని గురించి అందరూ తప్పక తెలుసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతి రెడ్డి విద్యార్థులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్ పర్సన్ కె. సాయి రమాదేవి ఆదేశాలతో మంగళవారం గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ లో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దేశంలో అందరు సమానమే అని, ఎవరు తక్కువ ఎవరు ఎక్కువ కాదని తెలిపారు. అలాగే మన హక్కే ఎదుటి వారి బాధ్యత అని చెప్పారు. చట్టాల గురించి అందరు తెలుసుకోవాలని, చట్టాలను ఎప్పుడు ఉల్లగించకూడదని తెలియజేసారు. పిల్లలకు పోక్స్, బాలల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మోడీ

- ఆరు గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ విఫలం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి





**నవతెలంగాణ-మద్దూరు**

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం,మోడీ కార్పోరేట్ సంస్థలకు కొమ్ముకాస్తుందని రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల గారడీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మద్దూరు మండల కేంద్రంలో ఆ పార్టీ ఆరో మహాసభను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న ఆ పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించిన ఆముదాల మల్లారెడ్డి, ర్యాలీగా మహాసభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకుడు ఎండి షఫీ మహమ్మద్, అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నాడని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీటిని ప్రయివేటు పరం చేస్తూ పేద ప్రజలపై అనేక భారాలు మోపుతున్నాడన్నారు. కేంద్రంలో బీజేపీ మూడుసార్లు అధికారంలోకి రావడానికి కార్పోరేట్ సంస్థలు ఆర్థికంగా సహకరిస్తున్నారని అన్నారు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వ సంస్థలన్నీటిని ప్రధాని మోడీ ప్రయివేటు పరం చేస్తున్నాడని, దేశంలో ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ కలిసి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులకు మైనార్టీలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ తెచ్చిన అని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ పదేళ్ళు పాలించి రాష్ట్ర సంపదను ఎంతో దోచుకున్నాడని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో నాయకులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేశారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో మాజీ సీఎం కేసీఆర్ రూ.లక్షల కోట్లు దోచుకున్నారని తెలిపారు. 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసి ప్రక్షాళనకు రూ.150 లక్షల కోట్లను కేటాయించడం దోచుకునేందుకేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలను పక్కనపెట్టి హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు . ప్రజా సమస్యలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాటం చేస్తుందని అన్నారు పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ప్రతి ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, చోప్పరి రవి, దాసరి ప్రశాంత్, తాడూరి రవీందర్, మండల నాయకులు ప్రశాంత్, పాల్గొన్నారు.

## రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం



**నవతెలంగాణ-మర్కుక్**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కొరకు రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి రైతుల సందేహాలను నివృత్తి చేస్తుంది. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వరి కొయ్యలను తగులబెట్టడం ద్వారా అనేక అనార్థాలు జరుగుతుందన్నారు. నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశించడమే కాదు, భూమిలో సారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరిగిపోవడం లాంటి నష్టాలు జరుగుతాయన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులకు ఆధునిక పద్ధతులపై అవగాహన కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం అని ఈ పద్ధతిని అందరు రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. వరి, ప్రత్తి కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రతి మంగళవారం రైతు వేదికలందు నిర్వహించబడునని రైతులకు తెలిపారు. రైతుల శ్రేయస్సు కోసం వ్యవసాయ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వీడియోకాన్ఫరెన్స్ విభాగాలను ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రంలో మండల వ్యవసాయ అధికారి టి. నాగేందర్ రెడ్డి , వ్యవసాయ విస్తీర్ణ అధికారులు రజినీ కాంత్, విష్ణు వర్ధన్, మీనాక్షి, రైతులు ,తదితరులున్నారు

## వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణంకు నష్టం

- వరి కొయ్యలను కలిస్తే పర్యావరణానికి తీవ్ర నష్టం
- మండల వ్యవసాయ అధికారి ప్రగతి



**నవతెలంగాణ-ములుగు**

వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి ప్రగతి తెలపడం జరిగింది. వరి కొయ్యలను కాలిస్తే కలిగే ముప్పు వల్ల వాటి పరిణామం గురించి, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. వ్యవసాయంలో ప్రస్తుత కూలీల కొరత ఉండడంతో రైతులు యంత్రాలనుఆశ్రయిస్తున్నారని వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తున్నారని, గడ్డి వినియోగం తగ్గిపోతుంది. పశు సంపద ఉన్నవారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అలాగే పొలములో వదిలేసి తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరికోయలతో పాటు గడ్డిని కూడా కాల్చి వేస్తున్నారు. రైతులు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యలతో భూమిలోని అవశేషాలు ఖనిజ లవణాలు నశిస్తాయని భూసారానికి ముంపు పొంచి ఉందని తెలియజేశారు.

**కాల్చడం వల్ల కలిగే నష్టాలు**

వరి కొయ్యలను కాల్చడం వలన వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది, ముఖ్యంగా నత్రజని ఫాస్ఫరస్ లాంటి పోషకపదార్థాలు శాతం తగ్గిపోతుంది. మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి దీనితో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పంట దిగుబడులు తగ్గిపోతాయి.

**కలియ దున్నితే లాభాలు**

వరి కొయ్యలను నేలలో కలియదుండటం వలన సేంద్రియ కార్బన్ శాతం పెరిగి దిగుబడులు ఐదు నుంచి 10 శాతం మేరకు పెరిగే అవకాశం ఉంది. దుక్కి దున్నే సమయాల్లో సింగిల్ సూపర్ ఫాస్పేట చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. కలియ దున్నితే దాదాపుగా ఎకరానికి సగం ఎరువు తయారవుతుంది. మొక్కలు 2శాతం నత్రజని, 4శాతం ఫాస్ఫరస్ అదనంగా అందుతుంది. నీటి నిలువ సామర్థ్యం పెరుగుతుంది. పొలం దున్నే పది రోజుల ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి తర్వాత ఎకరానికి 50కిలోల ఎస్ఎస్‌పీ చల్లుకోవాలి. దీనితో భూమి దెబ్బ తినకుండా భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు అని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి ప్రగతి ఏఈఓ పృథ్వి, మండల రైతులు పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా పోతిరెడ్డి రాజు



**నవతెలంగాణ-మద్దూరు**

సీపీఐ(ఎం) దూల్మిట్ట మండల నూతన కార్యదర్శిగా పోతిరెడ్డి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూల్మిట్ట మండల రెండో మహాసభ లో నూతన కార్యదర్శిగా పోతిరెడ్డి రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. మండలంలో రాబోయే మూడేండ్ల కాలంలో పలు రకాల పోరాటాలు నిర్వహించాలని తీర్మానాలు చేశారు. 1.దూల్మిట్ట మండలంలో పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం ఇతర అన్ని రకాల ప్రభుత్వ కార్యాలను వెంటనే ఏర్పాటు చేయాలి. 2.మండలంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్, మోడల్ స్కూల్ ని ఏర్పాటు చేయాలి 3. లింగాపురం, దూలిమిట్ట నుంచి బైరాన్ పల్లికి వెళ్లే చెక్ డ్యాముల పునర్మాణం వెంటనే చేపట్టాలి.4. 50 పడకల హాస్పిటల్‌ను దూలిమిట్ట మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి. 6.లద్నూర్, గౌరవెల్లి గండేపల్లి రిజర్వాయర్లను పూర్తి చేసి కాలువల ద్వారా చెరువులు కుంటలు నింపాలి. 7. చేర్యాల నుంచి కొండాపూర్ వరకు డబల్ రోడ్డు వెయ్యాలి, దూల్మిట్ట మండల కేంద్రం నుంచి బెక్కల్ గుట్ట పక్క నుంచి కూటిగల్ రహదారులు వెయ్యాలి. 8. బెక్కలు వాగు పై ఉన్న బ్రిడ్జిని మరమ్మతులు చేయాలి. తదితర డిమాండ్ల సాధన కోసం రాబోయే కాలంలో పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. మండల కార్యదర్శిగా పోతిరెడ్డి రాజు తో పాటు మండల కమిటీ సభ్యులుగా చొప్పరి ప్రసాద్, వంటే సత్యనారాయణ, మల్లం రమేష్, భుసనమైన రాజు, బావు ప్రభాకర్, చిలివేరు మహేష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కంఠమయ్య స్ఫూర్తితో కల్లుగీత వృత్తిని రక్షించుకుందాం



**నవతెలంగాణ-మద్దూరు**

నాడు నరరూప రాక్షసుల నుంచి తాటి వనాన్ని కాపాడి కల్లుగీత కార్మికుల వృత్తికి రక్షణ కల్పించిన కంఠమయ్య స్ఫూర్తితో నేడు తాటి ఈత వనాన్ని కాపాడుకోవాలని, వృత్తిలో ఉపాధి మెరుగుపరిచేందుకు ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా కార్యదర్శి బండకిందీ అరుణ్ కుమార్ కోరారు. మంగళవారం మద్దూరు మండలంలోనీ వంగపల్లి గ్రామంలో కల్లు గీత కార్మిక సంఘం గ్రామ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేజీకేఎస్ నూతన గద్దె నిర్మాణం జెండా ఆవిష్కరణ కార్యమానికి ముఖ్య అతిథిగా అరుణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడం, భూములకు ధరలు పెరగడంతో పట్టేదారులు తాటి ఈత చెట్లను అనుమతి లేకున్నా ఇష్టానుసారంగా లక్షలాది చెట్లను ధ్వంసం చేస్తున్నారనీ దీనీ ఫలితంగా కల్లుగీత కార్మికుల ఉపాధి దెబ్బతింటుంది. చెట్ల ధ్వంసం అరికట్టాలని కంఠమయ్య స్ఫూర్తితో ప్రకృతిని పరిరక్షించుకునేందుకు కల్లుగీత కార్మికులందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నిర్మించిన రిజర్వాయర్లతో కల్లుగీత కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఉపాధి కల్పించాలని కోరారు.జిల్లాలో తాటి చెట్ల పై నుండి పడి చావుబతుకుల్లో జీవితాలను వెల్లదీ స్తున్నారనీ అన్నారు. ప్రభుత్వ పరంగ ఇవ్వాల్సిన యెక్స్ గ్రేషియో కొన్ని సంవత్సరాలుగా ఇవ్వకుండా పెండింగులో పెట్టి నాన్చుడు ధోరణి అవలంబిస్తుందని ఇది మంచి పద్ధతి కాదని ఆయన అన్నారు, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. లేనిచో జిల్లాలోని కల్లు గీత కార్మికులను ఏకం చేసి ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ వంగపల్లి సొసైటీ నాయకులు కూరెళ్ళ రవీందర్, కురేళ్ళ శంకరయ్య, కురేళ్ళ కిష్టయ్య కురేళ్ళ శ్రీనివాస్, బాంగొని విజయ్, కరెళ్ళ తిరుపతి, శంకరయ్య, వెంకటయ్య, నలగొప్పుల రాజు, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## దళితుల అర్థనాదాలతో జిల్లా తెల్లారుతుంది

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



**నవతెలంగాణ-గజ్వేల్**

సిద్దిపేట జిల్లాలో రోజు రోజుకు ఎస్సీ, ఎస్టీలపై లైంగిక దాడులు పెరుగుతున్నందున సిద్దిపేట జిల్లాను ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం అట్రాసిటిలు జరిగే ప్రాంతంగా గుర్తించి నివారణకు చర్యలు తీసుకొవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎదొ ఒక గ్రామంలో నిత్యం ఎస్సీ ఎస్టీ ల పై కులం పేరుతో అవమానాలు,లైంగిక దాడులు, కుల దూషనలు, సాంఘిక బహిష్కరణలు, హత్యలు, భూముల అక్రమణలు నిత్యకృత్యంగా మారాయన్నారు. ఇటివల కాలంలో జగదెవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ , సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డి పల్లిలో సామాజిక బహిష్కరణలు, మర్కుక్ మండలం శివారు వెంకటపూర్, సిద్దిపేట రూరల్ మండలం సితారాంపూర్ లో దేవాలయాల ప్రవేశం నిరాకరించి వివక్షతను పాటించరన్నారు. కులాంతర వివాహల జంటలకు రక్షణ లేదు. ఎస్సీ, ఎస్టీ బాలికల పై సాముహిక లైంగిక దాడులు పెరుగుతున్నాయి. జగదేవపూర్ మండలం రాయవరం గ్రామానికి చెందిన దళిత యువతి పై సాముహిక లైంగిక దాడి, హుస్నాబాద్ ప్రాంతం లో గిరిజన యువతి లాడవత్ కల్పన పై అత్యాచారం, హత్య జరిగిందన్నారు. భారత రాజ్యం గా నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలను గ్రామ నడిఒడ్డున పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ అడ్డుకుంటున్నారు. దౌల్తాబాద్ మండలం గువ్వలేగి, మందాపూర్, గజ్వేల్ మండలం గిరిపల్లి తదితర గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాల ఎర్పాటును అడ్డుకుంటున్నారు. దళితులు తిరగబడి విగ్రహాలు ఏర్పాటు చెసుకొవాల్సిన పరిస్థితులు నెలకున్నాయని అన్నారు. ఎస్సీ,ఎస్టిల పైఅత్యాచారాల నివారణ కు చర్యలు తీసుకొవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

## రేపు మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష



**నవతెలంగాణ-చేర్యాల**

చేర్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రేపు(గురువారం) మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కొడిపల్లి ప్రశాంత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా నవంబర్ మాసంలో హైస్కూల్ స్థాయిలో విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే రేపు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 9 :30 గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో జరిగిన పరీక్షలో 8వ, 9వ, 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి పరీక్షకు సన్నద్ధం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కుటుంబ సర్వే బేస్



**నవతెలంగాణ-గజ్వేల్**

ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వే విజయవంతంగా కొనసాగుతుందని బీజేపీ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షులు నాయిని సందీప్ కుమార్ అన్నారు. మంగళవారం 11 వార్డులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య పరిశీలన చేసినట్లు ఆయన చెప్పారు. సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని దీని ద్వారా సామాజిక, ఆర్థిక, విద్యా ఉపాధి తదితర అంశాలకు ముడిపడి ఉందని పేర్కొన్నారు. తమ ఇంటికి వచ్చి సర్వేను కమిషనర్ పరిశీలన చేసినట్లు తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగున్నప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలకు న్యాయం చేసేలా ఉండాలని కోరారు. కాల యాపన కోసం కాకుండా ప్రజల కోసం ఉండాలని అన్నారు.

## కుటుంబ సర్వేను పరిశీలించిన ఇంచార్జి ఎంపీడీవో



**నవతెలంగాణ-నంగునూరు**

నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేను మంగళవారం మండల ఇంచార్జి ఎంపీడీవో ప్రభాకర్ రావు పరిశీలించారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకు పలు అంశాలపై సూచనలు చేశారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.ప్రజలు సర్వేకు అధికారులకు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ మజహర్, ఎన్యూమరేటర్ పాల్గొన్నారు.

## సీఎం సభకు తరలి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు



**నవతెలంగాణ-చేర్యాల**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవంలో ఇందిరా గాంధీ మహిళా శక్తి సభను మంగళవారం వరంగల్‌లో నిర్వహించారు. ఈ సభకు కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల, పట్టణ అధ్యక్షులు కొమ్ము రవి, మంచాల చిరంజీవులు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట డీసీసీ ఉపాధ్యక్షులు మెరుగు శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుర్మ ఆగంరెడ్డి, పట్టణ కార్యదర్శి దాసరి శ్రీకాంత్, కౌన్సిలర్లు ముస్త్యాల యాదగిరి, తుమ్మలపల్లి సంజీవులు, యూత్ అధ్యక్షులు కర్క సంతోష్ రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కో-కన్వీనర్ తాటికొండ సదానందం, ఏఎంసీ డైరెక్టర్ బైరగోని భాను తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కటకటాల పాలు

- ఏసీపీ పురుషోత్తం రెడ్డి



**నవతెలంగాణ-ములుగు:** ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే కటకటాల పాలు అవుతారని ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. ములుగు మండలం లక్ష్మక్క పల్లిలోని ఆర్వీఎం మెడికల్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ర్యాగింగ్ చట్టం గురించి, దాని పర్యవసనాల గురించి గజ్వేల్ రూరల్ సీఐతో కలిసి అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయవద్దని, ర్యాగింగ్ చేయడం నేరం, ర్యాగింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

## దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి

**నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్**

దాతల సహకారంతో మహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణ అభివృద్ధి సహకారం అవుతుందని పందిల్ల మాజీ సర్పంచ్ తోడేటి రమేష్ అన్నారు. మంగళవారం పందిల్ల గ్రామ పరిధిలోని పారిశ్రామిక యాజమాన్యం రాజరాజేశ్వర కాటన్ మిల్, బాలాజీ కాటన్ మిల్, పవనసుత రైస్ మిల్, వెంకటేశ్వర రైస్ మిల్, గౌరీ శంకర్ రైస్ మిల్, షణ్ముఖ రైస్ మిల్ వ్యాపారులు రూ.3 లక్షలు ఆలయ నిర్మాణానికి విరాళం కోసం మాజీ సర్పంచ్ రమేష్‌కు అందజేసినట్లు తెలిపారు. విరాళం అందించిన కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువకు రైతులు సహకరించాలి

**-రెవిన్యూ డివిజనల్ అధికారి రామ్మూర్తి**



**నవతెలంగాణ-కోహెడ**

గౌరవెల్లి ప్రాజెక్టు కింద కాలువ నిర్మాణ పనులకు భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వానికి సహకరించాలని హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని కూరెళ్ళ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువను ఉద్దేశించి రైతులకు అవగాహన కల్పించారు. రైతుల బావులు, బోరు బావులు, చెట్లు, తదితర వాటికీ ప్రత్యేక పరిహారం అందిస్తామన్నారు. ప్రాజెక్టు ముంపు బాధితులకు ఎలాగైతే పరిహారం అందిందో అదే విధంగా కాల్వతో భూమి కోల్పోయిన రైతులకు ఇప్పటి మార్కెట్ రేటు విలువకు మూడింతలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. అలాగే రైతుల నుంచి సలహాలు సూచనలు అడిగి తెలుసుకున్నారు. మరో రెండు లేదా మూడుసార్లు గ్రామ సభ్యులు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు సమస్యలు ఉన్న ఆఫీసులో కానీ నేరుగా కానీ కలవవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జీ తహసీల్దార్ దెవేంద్ర, భూసేకరణ నాయబ్ తహసీల్దార్ అరవింద్, గిర్దావర్ ఎల్లయ్య, ఇరిగేషన్ ఈఈ రమేష్, డీఈ రేష్మ, రెవెన్యూ అధికారులు, పోలీసులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాయకులకు దిశా నిర్దేశం చేసిన ఎమ్మెల్యే పల్లా

**నవతెలంగాణ-చేర్యాల**



చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని ఓ గార్డెన్ లో నిర్వహించారు. సమావేశానికి జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ నాలుగు మండలాల్లో అందరం చాలా ఐక్యంగా ఉండి సంవత్సరంలోపు అన్ని కార్యక్రమాలు చేసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం పోయిందనే భాదను దిగ మింగుకుంటూ పార్టీ కోసం రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల కంటే జనగామ చురుకుగా ఉండి అందులో చేర్యాల చాలా చురుకుగా ఉంటుందని, ఇక్కడ పార్టీ నాయకత్వం బలంగా ఉంటుందన్నారు. సమావేశంలో నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు

**-డీటీఆర్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు**



**నవతెలంగాణ-కోహెడ**

మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో "ప్రమాదప ుటంచున డీటీఆర్ అధికారులు జెర చూడరూ..!" అనే నవతెలంగాణ వార్తకు స్పందించిన విద్యుత్‌శాఖ అధికా రులు మంగళవారం చెట్లకొమ్మలను తొలగించారు. ఎన్నో రోజులుగా ప్రధాన రోడ్డు పరిధిలో ప్రమాదంగా మారిన మొక్క ను తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులను ఎదుర్కో న్నారు. అలాగే గ్రామంలోని విద్యుత్ తీగల సమీపంలో ఉన్న చెట్లను తొలగించడంతో గ్రామస్థులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

స్పందన

## 26 నుంచి భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచార ఉద్యమం

**నవతెలంగాణ-సిద్దిపేట**

నవంబర్ 26 నుంచి జనవరి 26 గణతంత్ర దినోత్సవం వరకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమం చేయనున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ గొప్పదనాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. అందుకే ప్రచార ఉద్యమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రౌతు రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్ల శంకర్ పాల్గొన్నారు.

## ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శిని పరామర్శించిన ఎమ్మెల్యే

**నవతెలంగాణ-చేర్యాల**



ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన అల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి అందె బీరయ్యను మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని తదుపరి మెరుగైన వైద్య చికిత్స కోసం తమ నీలిమ హాస్పటల్ రావాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ కరుణాకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, గదరాజు చందు, బురగోని తిరుపతి గౌడ్ తదితరులు ఉన్నారు.

## కొగిల మహేష్ అరెస్టు అప్రజాస్వామికం

**-దళిత బంధు రాష్ట్ర సలహాదారు దీటీ బాలనర్స్**



**నవతెలంగాణ-బెజ్జంకి**

దళిత బంధు అందజేసి దళితుల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి చేయాలని వరంగల్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రమందజేసి విజ్ఞప్తి చేయడానికి ప్రయత్నిస్తే దళిత బంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొగిల మహేశ్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని దళిత బంధు రాష్ట్ర సలహాదారు దీటీ బాలనర్స్ మంగళవారం మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో దళితుల ఆకాంక్షను అడ్డుకోలేరని వెంటనే లబ్దిదారులకు రెండవ విడత దళిత బంధు అందజేయాలని దీటీ బాలనర్స్ ప్రభుత్వాన్ని కోరారు.

## నిందితుడు కుంట భాస్కర్ అరెస్ట్

**నవతెలంగాణ-మర్కుక్**



మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన వివాహిత ఇస్తారి ప్రియాంక (25) అదే గ్రామానికి చెందిన కుంట భాస్కర్ లైంగికంగా వేధించడంతో ఇటీవల ఉరి వేసుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా మంగళవారం మర్కుక్ ఎస్ఐ దామోదర్ నిందితుడైన భాస్కర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## ఉచిత యోగ శిక్షణ

**నవతెలంగాణ-సిద్దిపేట**



ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా పబ్లిక్ సర్వెంట్ వెల్ఫేర్ అసోసియే షన్‌లో శుక్రవారం నుంచి పతాంజలి యోగా చీప్ పాట్రన్ అయిత అంజయ్య ఆధ్వర్యంలో ఉచిత యోగ శిక్షణ తరగతులు నిర్వహించబడునని భవన్ అధ్యక్షులు ఐతా అంజయ్య, కార్యదర్శి కోమండ్ల విక్రమ్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి కల్లేపల్లి శ్రీనివాస్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఉదయం ఐదున్నర గంటల నుంచి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. యోగ వల్ల బ్లడ్ ప్రెషర్, చక్కెర, థైరాయిడ్, ఎన్నో రోగాలకు సమస్యలు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. ఈ అవకాశం ప్రజలు సద్వినియం చేసుకోవాలని కోరారు.

## సర్వేకు ప్రజలు సహకరించాలి

**నవతెలంగాణ-గజ్వేల్**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సామాజిక, ఆర్థిక, కుల గణాంకాల సర్వేకు ప్రజలు సహకరించాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సర్వే చేస్తున్న సూపర్వైజర్లతో ఆయన పలు విషయాలు చర్చించారు. పట్టణ ప్రజలు సహకరిస్తే పూర్తి వివరాలు అధికారులకు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. సర్వే అధికారులకు ప్రజలు సహకరించితే పూర్తి సమాచారాన్ని ప్రభుత్వం అందుతుందని ఆయన అన్నారు. మున్సిపాలిటీలో ప్రతి వార్డులో ఇంటింటికి తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్న సూపర్వైజర్ల సర్వే ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి కి సర్వే అధికారులు వెళ్లి సమాచారం తీసుకోవాలన్నారు.

## మహిళ అభివృద్ధికి చిన్న సంఘాలు దోహదం

**-ఏపీఎం ఆనంద్ కుమార్, సీసీ రమేష్**



**నవతెలంగాణ-వర్గల్**

మహిళ అభివృద్ధికి చిన్న సంఘాలు ఎంతగానో దోహదపడతాయని ఏపీఎం ఆనంద్ కుమార్, సీసీ రమేష్ అన్నారు. మంగళవారం వర్గల్ మండలం అంబర్పేట గ్రామంలో గ్రూపులో లేని సభ్యులను కొత్తగా గ్రూపును ఏర్పాటు చేసి సంఘం ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి మహిళ తప్పనిసరిగా సంఘంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీవోఏ లక్ష్మితోపాటు గ్రామ సంఘం లీడర్లు పాల్గొన్నారు.

## మానవ సేవనే మాధవ సేవ

**నవతెలంగాణ-సిద్దిపేట :** మానవ సేవనే మాధవ సేవ అని మాజీ ఉప సర్పంచ్ చెందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణంలోని నాయిబ్రాహ్మణ కాలనీ వాసులకు చెందిరెడ్డి హేమంత్ రెడ్డితో కలసి మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీవో భవన్ మాజీ ప్రెసిడెంట్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ చందిరెడ్డి రాంరెడ్డి జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కాలనీలో సమస్యలు పరిష్కరించడానికి ఎల్లవేళలా సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కాలనీని దత్త తీసుకొని రానున్న రోజుల్లో స్వంత నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని వెల్లడించారు. కాలనీ వాసులు శ్రీనివాస్, శ్రీకాంత్, నాగరాజు, మహిళలు పాల్గొన్నారు.

# రైతుల సౌకర్యం కోసమే కొనుగోలు కేంద్రాలు

- దళారులను ఆశ్రయించవద్దు
- సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్



**నవతెలంగాణ-కొండపాక**

రైతుకు గిట్టుబాటు ధర అందించి వారికి ఇబ్బందులు లేకుండా చేయడం కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వము ఏర్పాటు చేసిందని సివిల్ సప్లై కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్ అన్నారు. కొండపాక మండలం దుద్దెడ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు. కొనుగోలు రికార్డులను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయాని అడిగారు. రైతుల ఇబ్బందులు పడకూడదనే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తూకమైన తర్వాత డబ్బులు ఎన్ని రోజుల్లో పడుతున్నాయని తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో నుంచి ధాన్యం తూకం చేసిన రైతుతో ఫోన్‌లో మాట్లాడి డబ్బులు పడ్డాయని అడిగారు. దళారులను ఆశ్రయించవద్దని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ , డిస్టిక్ సివిల్ సప్లై అధికారి తనుజ, తహసీల్దార్ దిలీప్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ, తదితరులు ఉన్నారు.

**నవతెలంగాణ-గజ్వేల్**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సివిల్ సప్లై ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహన్ అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు ఆధైర్యపడవద్దని ధాన్యంలో తేమశాతం సరిచూసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను వారం రోజులు రైతుల ఖాతాలో జమ అవుతాయని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికారులు రైస్ మిల్లులకు తరలిస్తున్నారని, ప్రభుత్వం సన్న వడ్లకు ప్రకటించిన రూ.500ల బోనస్‌ను రైతులు సద్వినిగం చేసుకోవాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి, గజ్వేల్ ఏఎంసీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్‌లతోపాటు సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.



## ఇండస్ట్రియల్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న చౌటపల్లి

**నవతెలంగాణ-అక్కన్నపేట**

అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేయబోతున్న ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును చౌటపల్లి గ్రామస్తులు వ్యతిరేకిస్తూ రైతులంతా మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు ఇల్లందుల జంపయ్య మాట్లాడుతూ సోమవారం కేవలం 10 నుంచి 15 మంది రైతులు కలెక్టర్‌ను కలిసి పార్కుకు అనుకూలమని తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసిన రైతులకు ఎవరికి కూడా అక్కడ పట్టాలు లేవని తెలియజేశారు. అక్కడ భూములు లేనటువంటి కొంతమంది రైతులు, నిజంగా భూమిని సాగు చేసుకుని బ్రతుకుతున్నటువంటి రైతులను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి పనులు చేస్తున్నారని, ఇట్టి విషయంపై పై అధికారులు దృష్టి పెట్టి పూర్వపరాలు చూడాలని తెలియజేశారు. కొంతమంది వారి సొంత స్వలాభం కోసం ఆ భూములను నమ్ముకుని సాగు చేసుకుంటున్నా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇండస్ట్రియల్ పార్కును గ్రామంలోని రైతాంగమంతా వ్యతిరేకిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెల్డి రంగారావు, జనగాం వేణుగోపాల్ రావు, గాదార్ల నాగభూషణం, చుంచు శంకర్, బోడుమల్ల భాగ్యమ్మ, పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

- డివిజన్ వ్యవసాయశాఖ అధికారి



**నవతెలంగాణ-కొండపాక**

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి బాబు నాయక్ అన్నారు. కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులు పంటలు దిగుబడి వచ్చిందన్నారు. వారికి టన్నుకు రూ.19వేల లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ఆయిల్ పామ్ పంటను సాగు చేసి లాభాలు పొందవచ్చని తెలిపారు. ఎక్కువగా కూలీల అవసరం లేదని పని తక్కువగాఉండి ప్రతినెలా దిగుబడి వస్తుందని తెలిపారు. ఒకసారి పంటను నాటిన నుంచి 30ఏండ్ల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. అంతర పంటగా వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. మొక్కలు నాటడానికి గుంతలు ఉపాధి పథకం ద్వారా తీసుకోవటం, డ్రిప్ పరికరాలు 90శాతం సబ్సిడీ మీద బీసీ, ఓసీలకు అలాగే ఎస్సీ, ఎస్టీ, రైతులకు నూటికి నూరు శాతం సబ్సిడీ పొందే అవకాశం ఉందన్నారు. అలాగే ఆయిల్ పామ్ తోట పెట్టిన నుంచి మూడేండ్ల వరకు ప్రతి ఏటా ఎకరాకు రూ. 4500 చొప్పున ఆయిల్ ఫెడ్ వారు రైతు ఖాతాలో జమ చేస్తారన్నారు. ఈ తోటలో అంతర్ పంటను నాలుగో ఏడాది నుంచి మిరియాలు, తమలపాకు, కోకోవా, పంటను వేసుకొని అధికంగా లాభాలు పొందే అవకాశం ఉందని సూచించారు. మండలంలో రైతులందరు ఆయిల్ ఫామ్ తోటలు పెంచి అధిక లాభాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరామకృష్ణ, ఏఈఓ మౌనిక, సంధ్య రైతులు పాల్గొన్నారు.

# పట్టణంలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్

**నవతెలంగాణ-సిద్దిపేట**



మంగళవారం పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పర్యటించారు. మైత్రివనం హౌసింగ్ బోర్డ్ పార్కుల నిర్వహణ పరిశీలించారు. పార్కుల్లో ఉన్న ఆటస్థల పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. పార్కులో ఉన్న మొక్కలకు ప్రతిరోజు నీరు పోసేలా ఒక వ్యక్తిని వెంటనే ఇక్కడ నియమించి ఆదేశించారు. పార్కులో ఉన్న ఓపెన్ జిమ్, మూత్రశాలలను సైతం వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. హౌసింగ్ బోర్డ్ వైపునగా వెళ తుండగా రోడ్డు పక్కన చెత్తను కాల్చడం గమనించిన కమిషనర్ వెంటనే వాహనం దిగి చెత్త కాల్చిన వారిని పిలిచి మరోసారి ఇలా చేస్తే చర్యలు తీసుకుంటామని అవగాహన కల్పించారు. కోమటి చెరువు వద్ద గల ప్రభుత్వ ఆసుపత్రి వారు హానికర చెత్తను వేరు చేయకుండా ఇవ్వడం గమనించి వెంటనే వారికి రూ.50వేల జరిమానా విధించడం జరిగింది. ధర్మ ఏజెన్సీకి అందించాలని ఇదివరకు గత రెండుసార్లు ఆస్పత్రికి వచ్చి తెలపడం జరిగిందని, అయినప్పటికీని మార్పు రాకపోవడంతో వారికి జరిమానా విధించడం జరిగిందన్నారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కళాశాల బాలుర వసతిగృహం, గిరిజన కళాశాల బాలుర వసతి గృహంలో పారిశుధ్య, వంట శాల గదిని, మూత్ర శాలను పరిశీలించారు. వంటగదిని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# పొగాకు వాడకంతో అనారోగ్యం తప్పదు

- డాక్టర్ నిమ్రాతరుణమ్



**నవతెలంగాణ-కోహెడ**

పొగాకు వాడకంతో అనారో గ్యం తప్పదని డాక్టర్ నిమ్రాత ~రుణమ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పొగాకు వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పొగాకు వాడకం కొద్ది కొద్దిగా మానవ శరీరంలో ప్రవేశించి ఒక్కో అవయవాలను పాడుచేస్తుందన్నారు. అలాగే ముఖ్యమైన అవయవాలైన కాలేయం, ఊపిరితిత్తులు, గుండేలా ంటి వాటిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందన్నారు. అతివాడకంతో క్యాన్సర్‌లాంటి వ్యాధులు ప్రబలుతా యని హెచ్చరించారు. విద్యార్థిదశ కీలకమైనదని ఇలాంటి చెడువ్యస నాలకు లోనుకాకుండా తగు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యా యులు మహమ్మద్ మహమూద్, సూపర్‌వైజర్ సుభద్ర, ఫార్మసిస్ట్ సమ్మయ్య, ఏఎన్ఎం గోవిందు మంజుల, ఆశా కార్యకర్తలు కవిత, పుష్ప, ఉపాధ్యాయులు ఓదేలు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించడానికే సీఎం కప్పు

- కాంగ్రెస్ నాయకులు, టోర్నీ నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి

**నవతెలంగాణ-సిద్దిపేట**

నైపుణ్యం గల క్రీడాకారులను గుర్తించడానికి సీఎం కప్పు క్రికెట్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకులు, టోర్నీ నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తుఇమామ్‌తో కలసి ఆయన టాస్ వేసి మొదటి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. పోటీల్లో గెలుపు పొందినవారు స్ఫూర్తిని చాటాలని, ఓడినవారు గెలిచేందుకు ప్రతిభను కనబరిచాలని అన్నారు. ప్రతిరోజూ క్రికెట్ పోటీలు జరుగుతాయని క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, పోటీలను విజయవంతం చేయాలని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరై క్రీడాకారులను ప్రోత్సహిస్తారని అన్నారు. గత ప్రభుత్వం లాగా తూతూమంత్రంగా పోటీలను నిర్వహించమని, గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్యదారి మధు, గాయాజుద్దీన్, నజ్జు, అమానుదిన్ తదితరులు పాల్గొన్నారు.



## వరి కొయ్యలను కాల్చవద్దు

**నవతెలంగాణ-కోహెడ**



వరి కొయ్యలను కాల్చడం వలన తీవ్ర నష్టాలు కలుగుతాయని మండల వ్యవసాయ అధికారి సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని తంగళ్ళపల్లి, వరికోలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఇతర పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి ఆరోగ్యం, పర్యావరణం, రైతుల ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. రైతులు పంట మిగుల్లను కాల్చకుండా ప్రకృతి పద్ధతులు అనుసరించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. పంట అవశేషాలను దహనం చేయడం వలన పోషకాల నష్టం, వాయు కాలుష్యం, కీటకాల పెరుగుదల, జీవవైవిధ్యం తగ్గడం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గడం వంటి నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శివకుమార్, టి.ప్రణీత, రాకేష్, శ్రీధర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రైతులు, గ్రామస్థులు , తదితరులు పాలొన్నారు.

# మండలంలో ముమ్మరంగా సమగ్ర ఇంటింటి సర్వే

- మండలంలో సుమారు 65 శాతం పూర్తి
- వివరాల నమోదుకు ప్రజల సహకారం



**నవతెలంగాణ-బెజ్జంకి**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ సమగ్ర ఇంటింటి సర్వే అధికారుల ప్రత్యేక శ్రద్ధతో మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలోని అయా గ్రామాల్లో సమగ్ర ఇంటింటి సర్వే సుమారు 65 శాతం పూర్తయింది. దీంతో సమగ్ర ఇంటింటి సర్వేను ప్రజలు ఆదరిస్తూ వివరాల నమోదుకు సహకారం అందిస్తున్నారు.

**మండలంలో 11423 ఇండ్లు**

ప్రభుత్వ ఆదేశానుసారం సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభంలో ఎన్యూమరేటర్లు ఇంటింటా స్టిక్కరింగ్ చేసి ఇండ్లను గుర్తించారు. సుమారు 11423 ఇళ్లకు స్టిక్కరింగ్ చేశారు. వివరాల నమోదుకు 103 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేసి 10 సూపర్ వైజర్లతో కార్యక్రమాన్ని ప్రత్యేకంగా పరిశీలించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నేల 9 నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటా సమగ్ర ఇంటింటా వివరాల నమోదుకు శ్రీకారం చుట్టారు. ఎన్యూమరేటర్లు నమోదు చేసిన వివరాల పత్రాలను తహసీల్ కార్యాలయంలో ప్రత్యేకంగా నిల్వ చేస్తున్నారు. నిత్యం నమోదు చేసిన వివరాల పత్రాలను భద్రపర్చుతూ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రికరించారు.

**ప్రజలు సహకరిస్తున్నారు**



మండలంలో చేపట్టిన సమగ్ర ఇంటింటా సర్వేకు ప్రజలు సహకరిస్తున్నారు. ప్రజలకు సమగ్ర ఇంటింటా సర్వే అవశ్యకతను వివరిస్తూ తలెత్తుతున్న అపోహలను నివృత్తి చేస్తున్నాం. సర్వే వివరాల నమోదును నిత్యం క్షేత్ర స్థాయిలో సందర్శించి పరిశీలిస్తున్నాం. ఈ నెల 30 వరకు సమగ్ర ఇంటింటా సర్వేను పూర్తి చేయాలని ప్రణాళిక రుపొందిం చుకున్నాం. ఎన్యూమరేటర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి వివరాల నమోదును పూర్తి చేసేల సమాయత్తమవ్వాలి. ప్రజలు ఒకే చోటనే వివరాలందిచాలి. సర్వేకు ప్రజలు సహరిస్తున్నారు.

-శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్, బెజ్జంకి.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్



**నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్**

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, అవి మన జీవితాన్ని నాశనం చేస్తాయని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస మూర్తి ఆదేశాల మేరకు మిట్టపల్లి, పొన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయికి దూరంగా ఉండాలని, దానివల్ల కలిగే పరిణామాలు, గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో తెలపడం జరిగిందన్నారు. ఎవరైన గంజాయి సేవించిన, రవాణా చేసినా, అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా ఈ చర్యలకి పాల్పడితే మాకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సబ్ ఇన్స్పెక్టర్స్ విజయ్, కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్స్ బాలమని, రవి, మౌనిక, స్వాతి, మంజుల, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అహర్నిశలు కృషి

- ఏపీఎం డాకయ్య



**నవతెలంగాణ-మిరుదొడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నదని ఏపీఎం డాకయ్య అన్నారు. మండలం నుంచి నేడు వరంగల్‌లో జరుగుతున్న ఇందిరా మహిళా శక్తి కార్యక్రమానికి మహిళలను బస్సుల్లో తరలించారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదిగే విధంగా మహిళా సంఘాలు దోహద పడుతున్నాయని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో అర్హులైన మహిళలు ఉంటే మహిళ సంఘాల్లో సభ్యులుగా చేర్చుకోవడం జరుగుతుందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతోపాటు ఆర్థికంగా ఎదగడానికి వ్యాపారాలు చేయడానికి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. సీసీ ప్రభాకర్, భూపాల్ వివో లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానాభివృద్ధికి పుస్తకాలు దోహదం

**నవతెలంగాణ-చేర్యాల**

పిల్లలు మానసికంగా, ఆరోగ్యంగా ఉండడానికి జ్ఞానాభివృద్ధికి పుస్తకాలు దోహద పడుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రావు అన్నారు. చేర్యాల మండలం కడవేర్గు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరారు. బాలసాహిత్య పఠనం పిల్లలకు ఆనందాన్ని ఇవ్వడమే కాక భావి జీవితంలో సమస్య పరిష్కారానికి సహాయం డుతుందని బాలసాహిత్యాన్ని విద్యార్థులు బాగా చదవాలని తెలుగు ఉపాధ్యాయుడు గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ సూచించారు. అనంతరం ఇటీవల "పత్తిపాక ఫౌండేషన్-గరిపెల్లి ట్రస్ట్" ద్వారా నిర్వహించిన 'అవ్వా తాతలకు ఉత్తరం రాద్దాం రాండి' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బాలల దినోత్సవ విజేతలకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, కృష్ణమూర్తి, రామకృష్ణ, లింగయ్య, మమత, అరుణ, ప్రీతి పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం | 20 నవంబర్ 2024 | www.navatelangana.com

## కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు



**నవతెలంగాణ-గజ్వేల్**

గత కొన్ని నెలలుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని మంగళవారం 7వ, 8వ, జాలిగామ బైపాస్ రోడ్డు, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణ కార్యాచరణ చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ నర్సయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కుక్క కాటుకు గురైతే వెంటనే డాక్టరును సంప్రదించి చికిత్స తీసుకోవాలని అన్నారు. వీధి కుక్కల నియంత్రణ కోసం మున్సిపల్ సిబ్బంది యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు అవసరమగు టీకాతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పరిధిలోని 20 వార్డుల్లో జరుగుతుందన్నారు. కావున పట్టణ ప్రజలందరూ సహకరించగలరని కోరారు.కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతోపాటు సాహిత్యం పట్ల అభిరుచి పెంచుకోవాలి



**నవతెలంగాణ-కొండపాక**

విద్యార్థి దశలో చదువుతోపాటు సాహిత్యం పట్ల అభిరుచి పెంపొందించుకోవాలని కొండపాక మండలం అంకిరెడ్డి పల్లి ప్రధానోపా ధ్యాయుడు చంద్రమౌళి అన్నారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు తెలంగాణ సారస్వత పరిషత్ వారు రాష్ట్ర బాలలకు నిర్వహించిన సాహిత్య పోటీల్లో ప్రతిభ కనపరిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పాఠశాలకు చెందిన విద్యార్థి రుచిత నగదు బహుమతి పొందగా సింధు ,విష్ణుప్రసాద్, శరణ్య, భరత్, రాకేష్, అక్షిత, రక్షిత, స్పందన, కీర్తన ప్రశంశ పత్రాలు అందుకున్నారని తెలిపారు. వారికి బహుమతులు అందజేశారు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులు డా.బి.సుధాకర్, రఘురామ శర్మ, తుకారం, జైపాల్ రెడ్డి, సురేష్, మాధవిలను అభినందించారు.

## నష్టపరిహారం ఇవ్వకుండా ప్లాట్లను వేలం వేయొద్దు

-మాకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాం
-సుడా వెంచర్ వద్ద గుడిసె వేసుకొని నిరసన తెలుపుతున్న బాధితులు



**నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్**

నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం తమ భూమిని వేలం పాట వేస్తుందని భూ బాధితుడు అఖిల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి సుడా వెంచర్‌లో తన భూమిలో గుడిసె వేసి వడ్లకొండ అఖిల్ గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తాతలకు కేటాయించిన భూమిలో సుడా వెంచర్ వేసి తమకు అన్యాయం చేస్తున్న అని పేర్కొన్నారు. గతంలో ఇందిరమ్మ హయంలో తమ తాతలకు భూములను కేటాయిస్తే ఆ భూములను వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. అలాంటి భూమిని గత ప్రభుత్వం సుడా ఆధ్వర్యంలో వెంచర్ వేసి తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు. తమకు న్యాయం జరిగే వరకు మా భూమిలో మేము ఉంటామని గుడిసె వేసుకొని ఇక్కడే స్థావరం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు మేము శిక్ష అనుభవిస్తున్నామని ఈ ప్రభుత్వమైన మాకు న్యాయం చేసి మమ్మల్ని కాపాడాల్సిందిగా కోరుచున్నామని తెలిపారు. తమ భూములు తీసుకున్నందుకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించి మాకు న్యాయం చేయవలసిందిగా కోరుతున్నామన్నట్లు తెలిపారు.

## లగచర్ల బాధితులను వదిలిపెట్టాలి

-బీఆర్ఎస్ నాయకులు మద్ది నరేందర్



**నవతెలంగాణ-గజ్వేల్**

లగచర్ల బాధితులను వది లిపెట్టాలని బీఆర్ఎస్ గజ్వేల్ నాయకులు మద్ది నరేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విషపూ రితమైన పరిశ్రమను తీసుకొచ్చి రైతుల భూములను తీసుకోవడం బాగు లేదన్నారు. భూములు కోల్పోతు న్నామని కోపంలో లగాచర్ల బాధితులు ఆవేదనకు గురి అయినట్లు అన్నారు. భూములు రైతుల నుంచి తీసుకోవద్దని, కాలుష్యం లేని పరిశ్రమంలో తీసుకొచ్చి ఉపాధి చూపించాలని కోరారు. రాజకీయాల మూలంగా రైతులు నష్టపోతున్నారని, రాజకీయాలు పక్కకు పెట్టి బాధితులను ప్రభుత్వం వదిలి పెట్టాలన్నారు. రైతులపై కేసులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం లేనిపోని అంశాలను ముందు వేసుకుంటుందన్నారు.

## గ్రంథాలయంలో ముగ్గుల పోటీలు



**నవతెలంగాణ-సిద్దిపేట**

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథి జిల్లా ఆడిట్ ఆఫీసర్ జయశ్రీ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ ఫోటోకి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తాను 24 ఏండ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగి, గ్రూప్స్ రాసి జిల్లా ఆడిట్ ఆఫీసర్‌గా నియమితులైనానని చెప్పారు. అందరూ కూడా గ్రంథాలయాన్ని సద్వినిగం చేసుకొని భవిష్యత్తులో మంచి ఉన్నత స్థానాలు చేరుకోవాలని చెప్పారు. కాంపిటేటివ్ ఎగ్జామ్స్ గ్రూప్స్ ప్రిపేర్ అయ్యేవాళ్ళని మాట్లాడిస్తూ మీరు రాబోయే ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా మంచి ప్రణాళికలతో చదవాలన్నారు. ముగ్గుల పోటీల్లో న్యాయ నిర్ణయితలుగా ఉండి పరిశీలించారు. లైబ్రేరియన్ డి.రాజు, కే.రాజు లు శాలువాతో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆడిట్ ఆఫీస్ సిబ్బంది వెంకటేష్, మౌనిక, గ్రంథాలయ సిబ్బంది ముసాఫర్, ఉమాపతి, సాయి, హరి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**నవతెలంగాణ-ములుగు**

మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన జాలిగామ నర్సింలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏజెడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జుబేర్ పాష మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశాడు. వారితో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తూర్పుంటి లక్ష్మణ్, కృష్ణమహేష్‌లు పాల్గొన్నారు.

## ఐక్యతతో మాలల హక్కులను సాధించుకోవాలి



**నవతెలంగాణ-మిరుదొడ్డి**

ఐక్యంగా ఉండి మాలల హక్కులను సాధించు కోవాలని, ఈనెల 21, 22 ,23 తేదీల్లో సిద్దిపేట జిల్లాలో మాలల మహా పాదయాత్ర కొనసాగు తుందని మాల మహానాడు నాయకులు తెలిపారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 22వ తేదీన మిరుదొడ్డి మండలానికి మహా పాదయాత్ర చేరుకోవడం జరుగుతుందన్నారు. మహా పాదయాత్రలో యువకులు మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాలల మహాపాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిలు , మాజీ ఎంపీటీసీ స్వామి, చంద్రం, యాదగిరి, ప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

## అలరించిన శతావధానం



**నవతెలంగాణ-సిద్దిపేట**

హరిహర రెసిడెన్సి సమీపంలో గల శ్రీలలితా చంద్రమౌళీశ్వర క్షేత్రం దేవాలయ చతుర్దశ(14)వ, వార్షికోత్సవం సందర్భంగా పందరి రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శతావధానం ఆహ్లాదభరితంగా జరిగింది. శతావధాని ఆముదాల మురళి రెండో రోజు పృచ్ఛకులు అడిగిన అంశాలకు 25 వర్ణనలు, 25 ఆశువులు చెప్పడం జరిగింది. పద్యం రసనైవేద్యం, అవధానాలతో పద్య విద్య అభివృద్ధి చెందుతుందని కవి, పండితులు దోర్బల ప్రభాకర శర్మ అభిప్రాయపడినారు. ఈ అవధానంలో దోర్బల ప్రభాకర్ శర్మ, ఉమాపతి రామ శర్మ, ఉజ్జయిని మహాకాళేశ్వరరావు, వరుకోలు లక్ష్మయ్య భ్రమరాంబిక, బిట్టు బాబు, కట్టా రంజిత్ కుమార్, తాటికొండ శివ కుమార శర్మ , చొప్పదండి సుధాకర్, పందరి రాధాకృష్ణమూర్తి, వైభవి మొదలైన పృచ్ఛకులు పాల్గొని అవధానాన్ని దిగ్విజయం చేశారు.

# ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



రాయపోల్



గజ్వేల్



ములుగు



మిరుదొడ్డి



మద్దూరు



చేర్యాల



సిద్దిపేట



అక్కన్నపేట

**నవతెలంగాణ-రాయపోల్**

దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షులు పడాల రాములు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి మహిళ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ పరిపాలనలో తనదైన శైలిలో ముద్రవేసి ప్రపంచంలోనే ఉక్కు మహిళగా పేరుగాంచారన్నారు. ఎన్నో సంస్కరణలు అమలుచేసి దేశంలో బడుగు బలహీనవర్గాల అభివృద్ధి కోసం పనిచేశారు. మెదక్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలుపొంది ప్రధాన మంత్రి పదవి చేపట్టడం ఉమ్మడి మెదక్ జిల్లాకు గర్వకారణం అన్నారు. దళిత గిరిజన బడుగు బలహీన వర్గాలకు చెందిన గూడులేని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు, భూమి పంపిణీ చేశారు. అలాగే వ్యవసాయం అభివృద్ధి కోసం పేద రైతులకు ఎడ్లు బండి పంపిణీ చేశారు. చివరకు దేశం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేశారు. కావున తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యమవుతుందని ఇందిరాగాంధీ మహాశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, నాయకులు నందం, కాసిం, ఎల్లయ్య, రాజు, ఆంజనేయులు గౌడ్, మహేష్, నర్సింలు, అంజత్, శ్రీనివాస్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

**ములుగు :** భారత మహిళ ప్రథమ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ములుగు మండల కేంద్రంలో జిల్లా కో ఆప్షన్ మెంబర్ సలీం, కడపల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షులు కడపల కృష్ణారెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కొండు నరసింహులు, చింతకింది రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహంకాళి, తాజా మాజీ వార్డు సభ్యులు రాజు, కాముని కంతల రాములు, తూర్పుంటి రాజు, లకడమైన కనకయ్య, నదీమ్, విజయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

**గజ్వేల్:** రోటి కపడా మఖాన్ నినాదంతో ప్రతి వ్యక్తి ఆర్థికంగా ఎదగడం కోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించి భారతదేశ స్థితిగతులను మార్చిన ఉక్కుమనిషి స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలో ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని ఆమె విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇందిరమ్మ పాలనలో ప్రతి గ్రామానికి రోడ్ల సౌకర్యం, ఇందిరమ్మ పథకంలో ఇండ్ల నిర్మాణం, దళితులకు భూ పంపిణీ, వ్యవసాయానికి కావలసిన బోరు బావుల నిర్మాణం, పథకాలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మార్చిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీ దేనని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కొని యాడారారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా ఉండి సహకారం అందిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం ఇంద్ర పార్క్ చౌరస్తా వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

**మిరుదొడ్డి :** అక్బర్ పేట-భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారతదేశ తొలి మహిళ ప్రధానమంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా 107వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం జాతీయ సమైక్యత దినోత్సవంగా చేసుకుంటుందని తెలిపారు. దేశంలోని పేద ప్రజల కోసం కానా మకాన్ (భోజనము, ఇల్లు) ప్రతి పేదవారికి అందించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందన్నారు. వ్యవసాయ భూములను పేదవారికి పంచిన ఘనత ఇందిరాగాంధీకి దక్కిందన్నారు. బ్యాంకులను జాతీయం చేయడం వలన ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. నెహ్రూ నుంచి అందిపుచ్చుకున్న నాయకత్వ పటిమతో ఉక్కు మహిళగా ఇందిరా గాంధీ గారు దేశ ప్రజలకు మేలు చేసిన ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోనపురం బాలు యాదవ్, బాల్తె వెంకటేశం, ఉత్తమ్ నరేష్, కడవెరుగు జగన్,షేర్ పల్లి స్వామి, మండల మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**మద్దూరు:** మద్దూరు మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేక మల్లేశం, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి ,ముఖ్య అతిథిగా హాజరై ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు ముస్త్యాల మనోహర్, ప్రధాన కార్యదర్శి వుట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి శంకర్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చేర్యాల :** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను మంగళవారం కాంగ్రెస్ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆమె చిత్రపటానికి, మండల పరిధిలోని నాగపురిలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సిద్దిపేట:** ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అత్తుఇమామ్, టీపీసీసీ మెంబర్ దరిపల్లి చంద్రం, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపీకృష్ణలు అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించి, పండ్లు, స్వీట్లు పంచి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి మొట్టమొదటి మహిళ ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి ఎనలేనని సేవలు చేసిన ఘనత ఆమెకు దక్కింది అని అన్నారు. దేశవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించి, భూమి లేని నిరుపేదలకు భూములు పంచి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఇందిర విగ్రహానికి నివాళులు...**

ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకొని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మార్క సతీష్ కుమార్, దాస అంజయ్య, బిక్షపతి, యేసు, బాలకృష్ణ, స్రవంతి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేట : అక్కన్నపేట మండలం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఐలయ్య మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే ఉక్కు మహిళగా పేరుగాంచిన దిశాలి ఇందిరా గాంధీ అని అన్నారు. అదే ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని తెలియజేశారు. పేద ప్రజల కోసం ఆమె ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, ఇప్పటికి దేశంలో ఆమె చేసిన అభివృద్ధి తప్ప మోడీ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు చింతల బాలరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అక్బర్, ఎస్సీ సెల్ బెజ్జంకి సారయ్య, మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులికశి రమేష్, పిరెళ్ల లింగమూర్తి, పొడిశెట్టి వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పత్తిపాక త్రిమూర్తి, నకీర్తి మునిరాజ్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## సర్వం కోల్పోయాం

- కొండ పోచమ్మ ముంపు బాధితుల గోడు
- యూఎస్, పట్నంలో ఉంటున్న వారికి ప్లాట్లు ప్యాకేజీలు
- న్యాయం చేయాలంటూ ఎమ్మార్వోకు వినతి



**నవతెలంగాణ-ములుగు**

కొండపోచమ్మ సాగర్ డ్యాం కోసం సర్వం కోల్పోయాం మా గోడు ఎవరు పట్టించుకోవడం లేదు. ఊర్లు విడిచి వచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికీ మాకు ప్లాట్లు ప్యాకేజీలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ప్లాట్లు ప్యాకేజీలు రాని కొండపోచమ్మ డ్యాం ముంపు బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. మంగళవారం మండల కేంద్రమైన ములుగు తహసీల్దార్ కార్యాలయనికి కొండ పోచమ్మ సాగర్ డ్యాంలో నేటికీ ప్లాట్లు ప్యాకేజీలు ఇవ్వలేదని పలువురు ముంపు బాధితులు తరలివచ్చి తహసీల్దార్‌కి వారి గోడు విన్నవించుకొని సమస పరిష్కారానికి కృషి చేయాలంటూ తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు విలేకరులతో మాట్లాడుతూ గుడ్డ గూడు లేకుండా సర్వం కోల్పోయామంటూ దిన దిన గండంగా జీవిస్తున్నామన్నారు. గోడు గత నాలుగేండ్లుగా ఎంతమంది అధికారులకు మొఱ్ఱపెట్టుకున్న ఫలితం దక్కలేదన్నారు. యూఎస్ పట్నంలో నివాసముంటు విలాసవంతంగా జీవిస్తున్న వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని ప్యాకేజీలు అందుతున్నాయి. కానీ ప్రభుత్వం చూపిన నివాసాల్లో ఉంటూ బతుకు దేవుడా అన్నట్లుగా ఉన్న మా గోసను ఏ అధికారికి కనిపించడం లేదని వాపోయారు. డబ్బులు ఇస్తేనే ప్యాకేజీలు అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు దర్శనమిస్తున్నాయన్నారు. అర్హులైన మాకు ప్లాట్లు ప్యాకేజీలు ఇవ్వకుండా ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం వహించడాన్ని మండిపడ్డారు. జలాశయం కోసం అన్ని కోల్పోయాం ఇక మిగిలినవి మా అవయవాలే అని అన్నారు. డబ్బులు ఇస్తేనే ప్యాకేజీలు వస్తాయంటే వాటిని సైతం అమ్మి డబ్బులు కట్టడానికి సిద్ధంగా ఉన్నామంటూ బాధితులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రవీణ్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్లాట్లు ప్యాకేజీలపై చర్చించి అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ జాప్యం..ప్రభుత్వంతో యుద్ధమే

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ

**నవతెలంగాణ-గజ్వేల్**

దేశంలో ఎస్సీ వర్గీకరణను అమలు చేసే తొలి రాష్ట్రంగా తెలంగాణ ఉంటుందని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ మాటను నిలబెట్టుకోకుండా మాదిగ జాతికి మోసం చేశాడని, ఇంకా ఎస్సీ వర్గీకరణను జాప్యం చేస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మీద మాదిగ జాతి యుద్ధమే చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాదిగలు హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం ముంద్రాతి కృష్ణ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మీద ముప్పై ఏళ్లు అలుపెరగని పోరాటం చేసి సుప్రీం కోర్టు ద్వారా విజయం సాధిస్తే , ఆ ఫలాలు మాదిగలకు అందించకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తుందని అన్నారు. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు కాకుండా అడ్డుకోవడానికి మాలలు కుట్రలు చేస్తుండడం దారుణమని అన్నారు. మాదిగ ప్రజలు ఏడు దశాబ్దాలుగా అన్ని రంగాల్లో అన్యాయాన్ని గురై కడుపు కాలి ఆకలి పోరాటం చేస్తుంటే, మాదిగలకు న్యాయం జరగద్దని మాలలు అధర్మ పోరాటం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంతిమంగా న్యాయం, ధర్మమే గెలుస్తుందని అన్నారు. మాదిగలు ఎస్సీ వర్గీకరణ కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పేర్క పర్శరములు ,నాయకులు మసాయి పేట యాదగిరి, మైస రాములు, మల్లిగరి యాదగిరి, లింగంపల్లి శ్రీనివాస్, రమేష్, ఉబ్బానీ ఆంజనేయులు, బుచ్చేంద్ర, యాదగిరి, పవన్ కళ్యాణ్, సిద్దిపేట మెదక్, సంగారెడ్డి జిల్లాలో నుంచి తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు గిట్టుబాటు ధర అందించాలి

- బీజేపీ మండల ఉపాధ్యక్షులు బారు అరవిందు



**నవతెలంగాణ-గజ్వేల్**

రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలని బీజేపీ గజ్వేల్ మండలం ఉపాధ్యక్షులు బారు అరవిందు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్ మండలంలో రైతుల పండించిన ధాన్యానికి మద్దతు ధర దక్కడం లేదని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పత్తి పంటను సీసీఐ కేంద్రాలకు తీసుకొచ్చే రైతులకు నానా ఇబ్బందులు వస్తున్నా యని చెప్పారు. తేమ శాతం పేరుతో కోతలు పెడుతున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం మర్చిపో యిందన్నారు. ఆరుగాలం పండించిన పత్తి పంటకు గిట్టుబాటు మద్దతు ధర లభించడం లేదని అన్నారు. అదేవిధంగా కంది, మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుకు మద్దతు చెల్లించేలా చూడాలన్నారు. గజ్వేల్ పత్తి మార్కెట్‌ను అందుబా టులోకి తీసుకురా వాలని కోరారు. ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం సాగిస్తుందని అన్నారు.

## అంగన్వాడీ పాఠశాలకు కుర్చీల బహూకరణ



**నవతెలంగాణ-రాయపోల్**

విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి సహృదయంతో మనమందరం సహకరించాలని కాంగ్రెస్ గొల్లపల్లి గ్రామ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం గొల్లపల్లి, ఉదయ్ పూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలకు 50 కుర్చీలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఫలితాలు సాధించాలంటే మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడం కోసం గ్రామస్తులందరూ సహకరించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కింద కూర్చోకుండా వారికి కుర్చీలు బహుకరిస్తే వినియోగంలోకి రావడంతో పాటు చిన్నారులకు ఎంతో మేలు చేకూరుతుందని భావించి అంగన్వాడి కేంద్రాల చిన్నారులకు కుర్చీలను అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునే చిన్నారులకు కుర్చీలు అందించడం పట్ల బండారి శ్రీనివాస్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, అంగన్వాడీ టీచర్ నర్సవ్వ, ఆశా వర్కర్ భాగ్యలక్ష్మి నాయకులు మహేష్, శ్రీకాంత్, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.